ninadam.in
తెలుగు దినపత్రిక
# నినాదం
నిఖార్సైన జర్నలిజం
శనివారం, మే 30, 2026 | సంపుటి - 22 | సంచిక 241 | వెల - 7 | పేజీలు - 12 - 8
Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

మహనీయుల విగ్రహాల ప్రతిష్ఠాపనలో ఇబ్బందులను
## సత్వరమే పరిష్కరించండి

- నిబంధనలకు విరుద్ధమైన స్థలాలపై నోటీసులివ్వాలి
- అధికారులు, పోలీసులు సమన్వయంతో ఉండాలి
- దళిత సంఘాల నాయకులపై కేసులు సరికాదు
- సీఎం సామాజిక న్యాయ సంకల్పానికి అనుగుణంగా మా ప్రభుత్వం
- అంబేద్కర్, పూలే, జగ్జీవన్ రామ్ ఆశయాలే కాంగ్రెస్‌కు మార్గదర్శకం
- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



2

తెలంగాణ ఈసెట్ ఫలితాలు
## విడుదల
వెబ్‌సైట్‌లో అందుబాటులోకి ఫలితాలు




2

**హైదరాబాద్, నినాదం:**
తెలంగాణ ఈసెట్ ఫలితాలు విడుదల అయ్యాయి. మాసాబ్ ట్యాంక్ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో శుక్రవారం ఉన్నత విద్యా మండలి చైర్మన్, ప్రొఫెసర్ బాలక్రిష్ణ రెడ్డి ఫలితాలను విడుదల చేశారు. ఈసెట్‌లో మొత్తం 16,726 మంది అభ్యర్థులు (93.60 శాతం) క్వాలిఫై అయ్యారు.



6

సరిహద్దు వెంట అక్రమ
## వలసదారులు పరుగు
తృణమూల్ పాలనలో వారికి ఊతకర్ర అందించిన వైనం

ఉచిత కరెంట్ ఎగవేసే
## పన్నాగం
కాంగ్రెస్ తీరుపై హరీష్ రావు ఆగ్రహం



2

**హైదరాబాద్, నినాదం:**
రైతులకు 24 గంటల కరెంట్ అవసరం లేదు. 3 గంటల కరెంట్ చాలని ఈఆర్సీ ఎదుట కాంగ్రెస్ నేత, రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే , అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకుడు వ్యాఖ్యలు రేవంత్ ప్రభుత్వ రైతు వ్యతిరేక ముఖాన్ని బట్టబయలు చేశాయని పేర్కొ న్నారు.

# ప్రజల నమ్మకం.. పరిపాలనలో పరిపక్వత

## తెలంగాణ భవిష్యత్‌కు టెక్నాలజీ దిక్సూచి : మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

(బిజిగిరి శ్రీనివాస్, ఎడిటర్-నినాదం)

**తెలంగాణ రాజకీయాల్లో పదవులు పొందిన నాయకులు చాలామందే ఉంటారు. కానీ ప్రజల మనసుల్లో స్థానం సంపాదించుకున్న నాయకులు మాత్రం అరుదు. అలాంటి అరుదైన నాయకత్వానికి ప్రతీక మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు. సంయమనం, విజన్, పరిపాలనా అనుభవం, ప్రజలతో మమేకమయ్యే స్వభావం.. ఈ నాలుగు లక్షణాలు ఒక నాయకుడిలో కలిస్తే ఆయన ఎలా ఉంటాడో చెప్పే ఉదాహరణే శ్రీధర్ బాబు.**

మంథని రాజకీయ చరిత్రలో దుద్దిళ్ళ కుటుంబానికి ప్రత్యేక స్థానం ఉంది. మాజీ స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాదరావు వారసుడిగా రాజకీయాల్లో అడుగుపెట్టిన శ్రీధర్ బాబు, కేవలం వారసత్వ నాయకుడిగా మిగలకుండా తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. రాజకీయాల్లో నిలబడటం ఒక్కటే కష్టం అనుకుంటే, విలువలను కాపాడుకుంటూ నిలబడటం మరింత కష్టం. ఆ కష్టాన్ని సాధ్యంచేసిన నాయకుడు ఆయన.

తండ్రి హత్య తర్వాత కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయినా, ఆ బాధను ప్రజాసేవగా మార్చుకున్న తీరు ఎంతో మందికి స్ఫూర్తి. రాజకీయాల్లో భావోద్వేగాలు ఎక్కువకాలం నిలవవు అంటారు. కానీ ప్రజల బాధలను అర్థం చేసుకుని, వాళ్ల కష్టాల్లో భాగస్వామ్యం అయ్యే నాయకుడిని ప్రజలు ఎప్పటికీ మరిచిపోరు. అందుకే మంథని ప్రజలకు శ్రీధర్ బాబు కేవలం ఎమ్మెల్యే కాదు... కుటుంబ సభ్యుడు.
ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలవడం వెనుక ఉన్న అసలు బలం ఆయన వ్యక్తిత్వం. గ్రామాల్లో చిన్న రైతు సమస్య నుంచి యువత ఉపాధి వరకు, విద్యార్థుల భవిష్యత్తు నుంచి వృద్ధుల సంక్షేమం వరకు ప్రతి అంశంపై ఆయనకు స్పష్టమైన అవగాహన ఉంటుంది. అందుకే సభలో మాట్లాడితే అధ్యయనం కనిపిస్తుంది... ప్రజల్లో తిరిగితే ఆప్యాయత కనిపిస్తుంది.

**రాజకీయాల్లో ఈరోజు మాటల యుద్ధాలు, వ్యక్తిగత విమర్శలు సాధారణమైపోయిన కాలంలో కూడా శ్రీధర్ బాబు తన సంయమనాన్ని కోల్పోలేదు. ప్రత్యర్థులను విమర్శించినా హద్దులు దాటరు. రాజకీయాలను శత్రుత్వంగా కాకుండా ప్రజాసేవా వేదికగా చూడటం ఆయన ప్రత్యేకత. అందుకే అన్ని పార్టీల నేతలతోనూ ఆయనకు గౌరవప్రదమైన సంబంధాలు ఉన్నాయి.**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంత్రిగా పనిచేసిన రోజుల్లోనే పరిపాలనపై ఆయనకు ఉన్న పట్టును అధికారులు గుర్తించారు. ఉన్నత విద్య శాఖలో పనిచేసినప్పుడు విద్యా రంగంలో మార్పులకు కృషి చేశారు. పౌర సరఫరాల శాఖలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇచ్చారు. ఆ అనుభవం ఇప్పుడు తెలంగాణ మంత్రివర్గంలో మరింత ఉపయోగపడుతోంది.

ప్రస్తుతం ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖల మంత్రిగా ఆయన బాధ్యతలు నిర్వహిస్తున్న తీరు ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిందే. ప్రపంచం మొత్తం కృత్రిమ మేధస్సు (AI), డిజిటల్ ఎకానమీ వైపు దూసుకుపోతున్న సమయంలో తెలంగాణను కూడా అదే దిశగా తీసుకెళ్లాలన్న దృఢ సంకల్పంతో ముందుకెళ్తున్నారు. హైదరాబాద్‌ను కేవలం ఐటీ నగరంగా కాకుండా భవిష్యత్ సాంకేతిక రాజధానిగా తీర్చిదిద్దాలన్న ఆయన ఆలోచనలు దేశవ్యాప్తంగా చర్చకు దారి తీశాయి.
స్టార్టప్‌లకు ప్రోత్సాహం, యువతకు ఉపాధి అవకాశాలు, ప్రపంచ స్థాయి కంపెనీలను తెలంగాణకు ఆకర్షించడం, గ్రామీణ యువతలో డిజిటల్ నైపుణ్యాల పెంపు ఈ అంశాలన్నింటిపైనా ఆయన ప్రత్యేక దృష్టి పెట్టారు. "తెలంగాణ యువత ఉద్యోగాలు వెతికే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి" అనే ఆయన మాటలు యువతలో కొత్త ఆశలు నింపుతున్నాయి.

అమెరికా, యూరప్ వంటి దేశాల్లో పెట్టుబడిదారులతో సమావేశాలు నిర్వహిస్తూ తెలంగాణకు పెట్టుబడులు తీసుకురావడంలో కూడా ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. విదేశీ సంస్థలతో సమావేశాల్లో తెలంగాణ సామర్థ్యాన్ని ఆయన వివరించే తీరు చూస్తే, రాష్ట్ర అభివృద్ధిపై ఆయనకు ఉన్న విజన్ అర్థమవుతుంది.

**శాసనసభ వ్యవహారాల మంత్రిగా సభ నిర్వహణలోనూ ఆయన ప్రత్యేక ముద్ర ఉంది. అధికార, ప్రతిపక్షాల మధ్య సమతుల్యత పాటిస్తూ ప్రజాస్వామ్య విలువలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. సభలో చర్చలు సజావుగా సాగేందుకు తీసుకునే నిర్ణయాలు ఆయన రాజకీయ పరిపక్వతకు నిదర్శనం.**

అంతటి బాధ్యతల మధ్య కూడా మంథని ప్రజలతో ఆయన అనుబంధం ఏమాత్రం తగ్గలేదు. పండుగైనా, సమస్యైనా, అభివృద్ధి కార్యక్రమమైనా ప్రజల మధ్యే కనిపిస్తారు. నాయకుడి గొప్పతనం ప్రజలతో దూరంగా ఉండటంలో కాదు... వాళ్లకు అందుబాటులో ఉండటంలోనే ఉందని ఆయన నిరూపిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కొత్త రాజకీయ సమీకరణాల్లోనూ తన విలువలను కోల్పోకుండా నిలబడటం ఆయన వ్యక్తిత్వ బలం. పదవులు వచ్చినప్పుడు పొంగిపోకుండా, కష్టాలు వచ్చినప్పుడు దిగులుపడకుండా సమతుల్యంగా ముందుకు సాగటం ఆయన నాయకత్వానికి ఉన్న విశిష్టత.
ఈరోజు ఆయన జన్మదినం సందర్భంగా మంథని నుంచి హైదరాబాద్ వరకు, గ్రామీణ కార్యకర్తల నుంచి ఐటీ రంగ ప్రముఖుల వరకు ఎంతో మంది ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ప్రజల కోసం ఆలోచించే నాయకులు రాజకీయాల్లో ఉండాలి అని కోరుకునే వారికి శ్రీధర్ బాబు ఒక ఆశాకిరణం.
తెలంగాణ భవిష్యత్తును సాంకేతిక రంగంలో అగ్రస్థానానికి తీసుకెళ్లాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్న ఈ ప్రజానాయకుడు మరెన్నో విజయాలు సాధించాలని కోరుకుంటూ...




***"అధ్యయనం ఉన్న నాయకుడు... అభివృద్ధి మీద దృష్టి ఉన్న మంత్రి ప్రజల గుండెల్లో స్థానం సంపాదించిన మనిషి – అదే దుద్దిళ్ళ శ్రీధర్ బాబు." జన్మదిన శుభాకాంక్షలు శ్రీధర్ బాబు గారికి..***

## అంచనాను మించి ధాన్యం ఉత్పత్తి

- అయినా చివరి గింజ వరకు కొంటూనే ఉన్నాం
- తడిసిన ధాన్యం సైతం కొని రైతులను ఆదుకున్నాం
- అదనపు కొనుగోళ్లకు రూ.16,479 కోట్లు ఖర్చు చేశాం
- మీడియా సమావేశంలో మంత్రులు వెల్లడి



**హైదరాబాద్,మే29(నినాదం):**
దేశంలోనే అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని ఈ మాట కేంద్రమే చెప్పిందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గతంలో పదేళ్ల బీఆరఎస్ పాలనలో కొనుగోళ్ల కంటే ఇప్పుడు ఎక్కువ కొంటున్నాం అన్నారు. సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు పాటిస్తూ చెప్పిన దానికంటే అదనంగా కొనుగోలు చేశాం అన్నారు. ▸▸ 2లో..

క్యూర్ పరిధిలో పేదలు సంతృప్తి చెందేలా
## ఇళ్ల డిజైన్

- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్,మే29(నినాదం):**
పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు సౌకర్యవంతమైన, భద్రమైన, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన ఇళ్లను నిర్మించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. పట్టణాల్లో జీవించే పేదవాడికి తన జీవనోపాధికి ఇబ్బంది ▸▸తరువాయి 2లో..

## పుణెలో కల్తీ మద్యం విషాదం

- కల్తీ మద్యానికి 11మంది మృత్యువాత
- ఆందోళనకరంగా పలువురి పరిస్థితి



**పుణె,మే29(నినాదం):**
మరోమారు కల్తీ మద్యం కాటేసింది. మహారాష్ట్రలోని పుణె జిల్లాలో కల్తీ మద్యం విషాదం చోటుచేసుకుంది. పుణె, పింప్రి చించ్వాడ్ జంట నగరాల్లో ఇప్పటివరకు 11 మంది మరణించినట్లు అధికారులు వెల్లడించారు. ▸▸తరువాయి 2లో..



## సెక్స్ వర్కర్లపై దాడులు సరికాదు

- వారు కూడా మనుషులే అని గుర్తించాలి
- లైంగిక వృత్తిలో ఉన్నవారికి ఆధార్ కార్డులు ఇవ్వాలి
- సుప్రీం కోర్టు స్పష్టీకరణ

6

నీట్ లీక్ బాధ్యత
# ఎవరిది?

- యుపిపిఎస్‌సిని చూసి నేర్చుకోండి
- విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆందోళనకు బాధ్యులెవరు
- నీట్ పేపర్ లీక్‌పై మరోమారు సుప్రీం ఆగ్రహం

**న్యూఢిల్లీ,మే29(నినాదం):**
నీట్ యూజీ పరీక్ష పేపర్ లీక్ వివాదంపై సుప్రీం కోర్టు మరోసారి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పర్యవేక్షణా యంత్రాంగాలు, సంబంధిత కమిటీలు ఉన్నప్పటికీ ఇంత పెద్ద ఉల్లంఘన ఎలా జరిగిందని కేంద్రాన్ని ప్రశ్నించింది. ఇలాంటి సంఘటన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తీవ్ర మానసిక క్షోభను కలిగిస్తుందని, వారిని ఇలా నిరాశపెట్టడం సరికాదని అభిప్రాయపడింది.

2

నీట్ పేపర్ లీకేజీ
## దోషులను వదలం

- వారిని కఠినంగా శిక్షించి తీరుతాం
- విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

**న్యూఢిల్లీ,మే29(నినాదం):**
నీట్ యూజీ పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. నీట్ యూజీ ఎగ్జామ్‌లో అవకతవకలు జరిగాయని.. ప్రశ్నపత్రం నిజంగానే లీక్ అయిందని అంగీకరించారు. పేపర్ లీక్‌లో ప్రమేయం ఉన్న వారెవరినీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. నీట్ పేపర్ లీక్‌కు సంబంధించిన అన్ని కేసులను ఫాస్ట్‌ట్రాక్ కోర్టులలో విచారిస్తామని.. తద్వారా నిందితులకు త్వరితగతిన కఠిన శిక్ష పడేలా చూస్తామని పేర్కొన్నారు.

కాలుష్య రహితంగా
## గోదావరి పుష్కరాలు

- కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి
- స్వచ్ఛ గోదావరిపై జూన్ 25 నాటికి పూర్తిస్థాయి నివేదిక
- అధికారులను ఆదేశించిన డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్



**అమరావతి,మే29(నినాదం):**
'స్వచ్ఛ గోదావరి' పవిత్ర పుష్కరాల' నేపథ్యంలో అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. కాలుష్యరహిత గోదావరి పుష్కరాల నిర్వహణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. నదిలోకి పారిశ్రామిక వ్యర్థాలు, మురుగు నీరు చేరకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు.

31న కార్మికులందరూ
## డిమాండ్ డేను పాటించాలి

- రాష్ట్ర ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనంపై..
- జూన్ 2న అపాయింటెడ్ డేట్‌ను ప్రకటించాలి
- కార్మికులకు ఆర్టీసీ జేఏసీ నాయకులు పిలుపు

2

**హైదరాబాద్,మే29(నినాదం):**
రాష్ట్ర ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం కోసం జూన్ 2న అపాయింటెడ్ డేట్‌ను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 31న కార్మికులందరూ డిమాండ్ డేను పాటించాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో జేఏసీ నాయకులు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కో కన్వీనర్ బి.యాదగిరి మాట్లాడారు. గత ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయటానికి చర్యలు చేపట్టి శాసనసభలో బిల్లు కూడా పాస్ చేసిందని గుర్తు చేశారు.



## తెలంగాణ బిడ్డలను ముట్టుకుంటే ఖబర్దార్

**ప్రొఫెసర్ నాగేశ్వర రావును అరెస్ట్ చేస్తే తీవ్ర పరిణామాలు**

**మళ్లీ గో బ్యాక్ ఆంధ్ర ఉద్యమం చేపడతాం**

**జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హెచ్చరిక**

హైదరాబాద్,మే29(నినాదం): తెలంగాణ బిడ్డలను ముట్టుకోవాలని ఆంధ్ర నుండి ఎవరైనా ప్రయత్నిస్తే, ఇక్కడ తీవ్ర పరిణామాలు ఉంటాయని, 'గో బ్యాక్ ఆంధ్ర' ఉద్యమం మళ్లీ మొదలవుతుందని జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హెచ్చరించారు. ప్రముఖ విశ్లేషకులు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ రావును విమర్శించే స్థాయి, అర్హత పవన్ కళ్యాణ్‌కు లేవని అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. దమ్ముంటే తెలంగాణకు వచ్చి ప్రొఫెసర్ నాగేశ్వర్ రావును అరెస్ట్ చేయండి, అప్పుడు ఆయన ఇంటి ముందు అడ్డుగా నేను నిలబడతాను అంటూ పవన్ కళ్యాణ్‌కు సవాల్ విసిరారు. ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు . పవన్ కళ్యాణ్‌ను ఒక ప్యాకేజ్ స్టార్ గా అభివర్ణించిన ఆయన, భవిష్యత్తులో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గనుక ఎక్కువ ప్యాకేజ్ ఇస్తే ఆయనకు కూడా సపోర్ట్ చేయడానికి పవన్ వెనకాడరని ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయ నాయకుల తీరుపై మండిపడుతూ.. 'మీరంతా ఉండేది, ఆస్తులు సంపాదించుకునేది హైదరాబాద్‌లోనే కదా, మరి అన్ని వేల కోట్లు పెట్టి అమరావతిని ఎందుకు కట్టుకుంటున్నారు?' అని అనిరుధ్ రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలను తక్కువ చేసి మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని, రాజకీయాల కోసం ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టడం సరికాదని హితవు పలికాడు.

## తెలంగాణలో అంచనాను మించి ధాన్యం ఉత్పత్తి

దీనికోసం రూ.16,479 కోట్లు ఖర్చు చేశాం. రాష్ట్రంలో చివరి గింజ వరకు కొనుగోలు చేసే బాధ్యత మాది అని ఉత్తమ్ తెలిపారు. ధాన్యం సేకరణకు క్షేత్రస్థాయిలో 13వేల వాహనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 2 లక్షల మంది సిబ్బంది సేకరణలో పాల్గొంటున్నారని చెప్పారు. సేకరణ కేంద్రాలకు 20.86 కోట్ల గన్నీ బ్యాగులు పంపామన్నారు. ధాన్యం కొనుగోలు చేసి రూ.11,050 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశామని వివరించారు. 'ధాన్యం సేకరణకు బిహార్, బెంగాల్ కార్మికులపై ఆధార పడి ఉన్నాం. బెంగాల్ ఎన్నికలకు కార్మికులు స్వస్థలాలకు వెళ్లి రావడం ఆలస్యమైంది. మద్దతు ధర కోసం మా ప్రభుత్వం రూ.49 వేల కోట్లు వెచ్చించగా.. గత ప్రభుత్వం రూ.10వేల కోట్లే ఇచ్చింది. ఈ విషయంలో ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఇప్పటికే రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. గతంలో ఎన్నడూ లేని విధంగా ధాన్యం పండింది.. ఏ రాష్ట్రంలో జరగని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు జరుగతున్నాయని స్పష్టం చేశారు. ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ గా ఉందన్నారు. ధాన్యం సేకరణ విషయంలో ప్రతిపక్ష బీఆరఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో కనీస మద్దతు ధరకే అన్ని రకాల ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. ఎంఎస్ పీ ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు 16వేల కోట్ల రూపాయలు ఖర్చు ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. రాష్ట్రంలో 143 లక్షల టన్నుల ధాన్యం పండితే.. ఇప్పటివరకు 73 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతు ఖాతాల్లోకి డబ్బులు జమ చేస్తున్నామన్నారు. చివరి గింజ వరకు మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. యాసంగిలో రాష్ట్ర ప్రభుత్వం 73 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది..అయితే ఇందులో కేంద్ర ప్రభుత్వం కేవలం 5 లక్షల ధాన్యమే కొనుగోలు చేస్తామని చెబుతోంది.. ఏటా తెలంగాణ నుంచి ధాన్యం కొనుగోళ్లను తగ్గిస్తూ వస్తోంది. ధాన్యం కొనుగోళ్లు పెంచాలని కేంద్రాన్ని సీఎం రేవంత్ రెడ్డితో కలిసి కేంద్ర ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకోవడం లేదు. బీజేపోళ్లు ధర్నా చేసుడు కాదు.. ఢిల్లీకి వెళ్లి వడ్లను కొనాలను కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోళ్లకు 16వేల కోట్ల రూపాయలు అదనంగా ఖర్చు చేశామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న చివరి గింజ వరకు ధాన్యం సేకరణ జరగుతుందన్నారు. ధాన్యం సేకరణలో 2వేల మిల్లులు పనిచేస్తున్నాయన్నారు. ధాన్యం తరలించేందుకు 13వేల వాహనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో హమాలీల కొరత ఉన్న మాట వాస్తవమే అయినప్పటికీ ధాన్యం కొనుగోలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బీఆర్ ఎస్ హయాంలో ఏడాదికి 15వేల ఇస్తే కాంగ్రెస్ హయాంలో 49వేల కోట్లు ఇస్తున్నామన్నా రు మంత్రి.. తెలంగాణలో 60 లక్షల టన్నుల ధాన్యం కొంటే.. ఏపీలో 24 లక్షలే కొన్నరని పోల్చి చెప్పారు. ఇప్పటివరకు రూ.11వేల 50కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం.. రెండున్నరేళ్లలో రూ.36వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. వడ్లను కొన్న 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామన్నారు. చివరి గింజ కొనేవరకు కొనుగోలు కేంద్రాలు పనిచేస్తాయని, ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన 10వేల 214 టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

## సరిహద్దు వెంట అక్రమ వలసదారులు పరుగు

**కోల్‌కతా, నినాదం:**

మమతా బెనర్జీ కాలం నాటి అక్రమాలు తన్నుకు వస్తున్నాయి. ముఖ్యంగా బంగాదేశ్ చొరబాటు దారులను ఎలా కాపాడారో కూడా అర్థం అవుతోంది. అలాగే చొరబాటు దారులకు గేట్లు బార్లా తెరిచారు. ఈ విషయం ఇప్పుడు కళ్లకు కన పడుతోంది. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బంగ్లాదేశీ అక్రమ వలసదారుల కంటిమీద కునుకు లేకుండా పోయింది. అరెస్టుల భయంతో అక్రమ వలసదారులు అల్లాడిపోతున్నారు. ఈ నేపథ్యంలోనే నిత్యం వందల మంది సరిహద్దు ప్రాంతాలు, ఇండియా నుంచి బంగ్లాదేశ్‌కు వెళ్లే మార్గాలకు చేరుకుంటున్నారు.

## పుణెలో కల్తీ మద్యం విషాదం

పలువురు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నారు. బాధితుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. లోకల్ మద్యం సేవించిన అనంతరం బాధితులు ఒక్కసారిగా వాంతులు, కంటిచూపు మందగించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వంటి లక్షణాలతో కుప్పకూలినట్లు సమాచారం. వెంటనే వారిని సమీప ఆస్పత్రులకు తరలించినప్పటికీ పలువురు చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఘటనపై స్పందించిన మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కల్తీ మద్యం తయారీ, విక్రయాల్లో పాల్గొన్నవారిని గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని సూచించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఇప్పటివరకు ఇద్దరు నిందితులను అధికారికంగా అరెస్ట్ చేసినట్లు పింప్రి ఏసీపీ సచిన్ హిరే వెల్లడించారు. వీరిద్దరూ మద్యం సరఫరా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

## ఉచిత కరెంట్ ఎగవేసే పన్నాగం

అమెరికా వేదికగా రేవంత్ రెడ్డి చెప్పిన మాటలను ఇప్పుడు అమలు చేసే దిశగా కుట్రలు జరుగుతున్నాయని వెల్లడించారు. పొలం అంటే ఏమిటో.. బోరు ఆగిపోతే పంట ఎలా ఎండిపోతుందో.. రైతు రాత్రింబవళ్లు ఎలా కష్టపడుతాడో తెలియని వాళ్లు మాత్రమే 3 గంటల కరెంట్ చాలని మాట్లాడతారని ఆరోపించారు. బీఆరఎస్ ప్రభుత్వం రైతుకు 24 గంటల నాణ్యమైన ఉచిత కరెంట్ ఇచ్చి తెలంగాణ వ్యవసాయాన్ని దేశానికి ఆదర్శంగా నిలబెట్టిందని, కాంగ్రెస్ మాత్రం అదే రైతును మళ్లీ చీకట్లలోకి నెట్టే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత రుణమాఫీని అటకెక్కించారని, రైతు బంధు బంద్ చేశారని, పంట బోనస్ బోగస్ చేశారని మండి పడ్డారు. ఎరువుల సరఫరాలో ఫెయిల్ అయ్యారు. పంట కొనుగోళ్లు చేయక రైతుల ప్రాణం తీస్తున్నారని విమర్శించారు. ఇవి చాలదన్నట్లు కేసీఆర్ ఎంతో శ్రమించి అమలు చేసిన 24 గంటల కరెంట్‌ను ప్రణాళిక ప్రకారం ఖతం పట్టిస్తున్నారని ఆరోపించారు. రైతు డిస్కం వెనుక దాగి ఉన్న కాంగ్రెస్ అసలు కుట్ర ఇదేనా? అంటూ అనుమానాలు వ్యక్తం చేశారు. కరెంట్ కోతలతో, రైతులకు వాతలు పెట్టాలని చూస్తున్న రేవంత్ కుట్రలను యావత్ తెలంగాణ రైతాంగం గమనిస్తోందని, రైతు వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పే రోజు దగ్గరలోనే ఉందని జోస్యం చెప్పారు.

## వివోలకు ఇచ్చిన హామీలను విస్మరించిన కాంగ్రెస్

**వివోల నిరవధిక దీక్షలకు బిఆరఎస్ మద్దతు**

నిజామాబాద్ : ఎన్నికల హామీలను కాంగ్రెస్ తుంగలో తొక్కేసిందని, వీవోఏలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించి మోసం చేసిందని బీఆరఎస్ మండల నాయకులు పేర్కొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోటగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న వీవోఏ ల నిరవధిక సమ్మెకూ కోటగిరి మండల బీఆరఎస్ నాయకులు శుక్రవారం సంఘీభావం తెలిపారు. వీవోఏల న్యాయమైన డిమాండ్లు పరిష్కారం అయ్యేంత వరకు బీఆరఎస్ తరుపున పూర్తి మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు. 2023 లో అసెంబ్లీ సాక్షిగా నాటి ఎమ్మెల్యే ప్రస్తుతం మంత్రి సీతక్క ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వీవోఏ ల సమస్యలపై ప్రశ్నించారని, ఆనాడు ప్రశ్నించిన సీతక్క ఇప్పుడు అదే శాఖ సంబంధించిన మంత్రి ఉన్నారని, ఆనాటి సమస్య నేడు గుర్తుకు రావడం లేదా అని మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక రకంగా అధికార పక్షంలో ఉన్నప్పుడు ఒక రకంగా ఉండడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వీవోఏలకు సేర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు ట్యాబ్ తోపాటు నెట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి సీసీ లుగా ఉద్యోగోన్నతి కల్పించాలని, రూ.20 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

## నీట్ పేపర్ లీక్ బాధ్యత ఎవరిది



పేపర్ లీక్ విషయంలో లోపాలకు జవాబుదారీతనం ఉండాల్సిందేనని, అప్పటి వరకు అసలు సమస్య ఆగదని వ్యాఖ్యానించింది. అయితే, యువత ఆందోళనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంటోందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీం ధర్మాసనానికి వెల్లడించారు. పరిస్థితిని ప్రధానమంత్రి కూడా వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. జూన్ 21న మరోసారి నిర్వహించే నీట్ యూజీ పరీక్ష కోసం కొత్త యంత్రాంగాలను ఏర్పాటు చేశామన్నారు. అయితే, ఈ వ్యవహారంపై ప్రతిస్పందన తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించిన సుప్రీం ధర్మాసనం.. తదుపరి విచారణను జులై రెండో వారానికి వాయిదా వేసింది. నీట్ పేపర్ లీక్ ఉదంతంపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై(ఎన్‌టీఏ) పలు ప్రశ్నలు సంధించింది. ఇన్ని నిఘా వ్యవస్థలు, కమిటీలు ఉన్నా పేపర్ ఎలా లీకైందని ప్రశ్నించింది. యూపీఎస్‌సీలో ఇలాంటి ఉదంతాలు ఎప్పుడూ వెలుగుచూడలేదని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. యూపీఎస్‌సీని చూసి నేర్చుకోవాలని ఎన్‌టీఏకు సూచించింది. నీట్ వ్యవస్థ ప్రక్షాళనకు కేంద్రం ఏర్పాటు చేసిన హైలెవెల్ కమిటీ చైర్మన్, ఇస్రో మాజీ చీఫ్ డా. రాధాకృష్ణన్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌టీఏ, డా. రాధాకృష్ణన్ దాఖలు చేసిన అఫిడవిట్‌లను సర్వోన్నత న్యాయస్థానం పరిశీలించింది. కేంద్రం తన ఎఫిడవిట్ దాఖలు చేసేందుకు న్యాయస్థానం అదనపు గడువు ఇచ్చింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ నరసింహ మాట్లాడుతూ పేపర్ లీక్‌కు ఆస్కారం కల్పించిన పరిస్థితులు ఏమిటని డా. రాధాకృష్ణన్‌ను కోర్టు ప్రశ్నించారు. గతంలో అనేక రక్షణలను ఏర్పాటు చేసినా పేపర్ లీక్ ఎలా అయ్యిందని అన్నారు. ఇందుకు డా. రాధాకృష్ణన్ బదులిస్తూ పేపర్ సెట్టింగ్ ప్రక్రియలో సమస్య ఉందని అన్నారు. ప్రస్తుతం ఆ లోపాలను సరిదిద్ది వ్యవస్థను మరింత బలోపేతం చేశామని అన్నారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి సమస్య తలెత్తకుండా గతంలో మొత్తం 101 సూచనలు చేశామని చెప్పారు. వాటిల్లో 60 తాత్కాలిక సూచనలను 2025`26 పరీక్ష కోసం ప్రత్యేకంగా రూపొందించినట్టు చెప్పారు. ఇతర మార్గదర్శకాలు కూడా త్వరలో పూర్తిస్థాయిలో అమలవుతాయని చెప్పారు. మరోసారి ఇలాంటివి జరగవని ధీమా వ్యక్తం చేశారు. సంస్కరణలే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కేవలం సంస్కరణలతో పరిస్థితి చక్కబడదని కోర్టు వ్యాఖ్యానించింది. తప్పు జరిగినప్పుడు బాధ్యత ఎవరిదనే దానిపై స్పష్టత ఉండాలని పేర్కొంది. బాధ్యత ఎవరు తీసుకుంటారనేది తేల్చకుండా ఎన్ని కమిటీలు, మీటింగ్‌లు ఏర్పాటు చేసిన ఫలితం ఉండదని వ్యాఖ్యానించింది. ఇక ఈ అంశంపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ పేపర్ లీక్‌పై విచారణ జరుగుతోందని అన్నారు. జూన్ 21 నాటి పరీక్ష నిర్వహణ కోసం కొత్త వ్యవస్థలను ఏర్పాటు చేశామని అన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుందని చెప్పారు. ప్రధాని స్వయంగా ఈ అంశాన్ని పర్యవేక్షిస్తున్నారని కోర్టుకు తెలిపారు.

### నీట్ పేపర్ లీకేజీ దోషులను వదలం

నీట్ యూజీ పరీక్ష నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఫెయిల్ అయ్యిందన్నారు. శుక్రవారం కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఓ నేషనల్ మీడియా టీవీ ఛానెల్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ..నీట్ యూజీ పేపర్ లీక్ అయిందని అంగీకరిస్తున్నాను. ఎన్‌టీఏ విఫలమైంది. ఈ విషయాన్ని నేను ఒప్పుకుంటున్నానని పేర్కొన్నారు. వైద్య ప్రవేశ పరీక్ష సమగ్రతను దెబ్బతీస్తున్న విద్యా మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవడానికి మోడీ సర్కార్ కట్టుబడి ఉందని అన్నారు. పేపర్ లీకేజీలో పాలుపంచుకున్న వ్యవస్థీకృత నెట్‌వర్క్‌లపై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకుంటుందని విద్యార్థులకు, తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. సీబీఎసఈ 12వ తరగతి పరీక్ష ఫలితాల్లో నెలకొన్న గందరగోళం పైన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందించారు. సీబీఎసఈ మూల్యాంకన వ్యవస్థలో ఓఎసఎంకు సంబంధించిన సాంకేతిక సమస్యలతో సహా పలు సమస్యలు ఉన్నాయని అంగీకరించిన ఆయన.. వాటిని ప్రస్తుతం ఐఐటీ నిపుణుల సహాయంతో పరిష్కరిస్తున్నారని తెలిపారు. సీబీఎసఈ ఉపయోగించే పేమెంట్ గేట్‌వే విదేశీ హ్యాకర్ల నుంచి జరిగిన సైబర్‌దాడికి గురైందని హాట్ కామెంట్స్ చేశారు. 11 లక్షలకు పైగా విద్యార్థులు ఇప్పటికే తమ జవాబు పత్రాల కాపీలను పొందగా.. నాలుగు లక్షలకు పైగా అభ్యర్థులు పునః మూల్యాంకనం కోసం దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. అవసరమైన దిద్దుబాటు చర్యలు తీసుకుంటామని విద్యార్థులకు, తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు.

## తెలంగాణ ఈసెట్ ఫలితాలు విడుదల

ఈ సందర్భంగా బాలక్రిష్ణ రెడ్డి మాట్లాడుతూ.. త్వరలోనే కౌన్సిలింగ్ షెడ్యూల్ విడుదల చేస్తామని చెప్పారు. జూలై మొదటి వారంలో క్లాసెస్ ప్రారంభం అవుతాయని తెలిపారు. ఫీజులు గత ఏడాది మాదిరిగానే ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొ. కుమార్ మొలుగారం, ఈసెట్ కన్వీనర్ ప్రొ.చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు. దీంతో రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ ప్రవేశాలకు ఎదురుచూస్తున్న విద్యార్థుల నిరీక్షణకు తెరపడింది. మే 15న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్ష ఫలితాలు, విద్యార్థుల మార్కుల వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. డిప్లొమా(పాలిటెక్నిక్), బీఎస్సీ(మ్యాథమెటిక్స్) పూర్తిచేసిన విద్యార్థులకు నేరుగా బీటెక్, బీఫార్మసీ కోర్సుల ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలు కల్పించేందుకు ఈ పరీక్షను ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. ఫలితాల విడుదల నేపథ్యంలో ఇంజినీరింగ్ కాలేజీల్లో చేరాలనుకునే విద్యార్థుల్లో సందడి నెలకొంది. పరీక్షకు హాజరైన అభ్యర్థులు తమ ఫలితాలను, ర్యాంక్ కార్డులను అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అభ్యర్థులు తమ హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీ, రిజిస్ట్రేషన్ నంబర్‌ను నమోదు చేసి స్క్రీన్‌పై ఫైనల్ ర్యాంక్‌ను చూసుకోవచ్చని ఉన్నత విద్యా మండలి అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే కొద్ది రోజుల్లోనే కేటగిరీల వారీగా కౌన్సెలింగ్ తేదీలు, సర్టిఫికేట్ వెరిఫికేషన్, వెబ్ ఆప్షన్ల నమోదుకు సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ప్రకటించనుంది. అడ్మిషన్ల ప్రక్రియ ముగిసే వరకు విద్యార్థులు తమ ర్యాంక్ కార్డులను, హాల్ టికెట్లను జాగ్రత్తగా ఉంచుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. కౌన్సెలింగ్‌కు సంబంధించి అప్‌డేట్ల కోసం విద్యార్థులు నిరంతరం అధికారిక వెబ్‌సైట్‌ను పరిశీలించాల్సిందిగా కోరారు.

## క్యూర్ పరిధిలో పేదలు సంతృప్తి చెందేలా ఇళ్ల డిజైన్

లేకుండా గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి విజన్‌కు అనుగుణంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. క్యూర్ పరిధిలోని 24 నియోజక వర్గాల్లో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి ఇటీవల జరిగిన రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి రూపొందించిన పలు నమూనా డిజైన్లను పరిశీలించి పలు కీలక మార్పులు, సూచనలు చేశారు. రానున్న 40 నుండి 50 సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. కేవలం ఇళ్లు కట్టడం మాత్రమే కాదు,భవిష్యత్ తరాలకు అనుకూలంగా ఉండే విధంగా డ్రైనేజీ వ్యవస్థ, పార్కింగ్, వాణిజ్య అవసరాలు, ప్రజల జీవనశైలిని దృష్టిలో పెట్టుకొని సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. స్థానిక పరిస్థితులను బట్టి అవసరమైతే 10 అంతస్తుల వరకు భవనాలు నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ల్, బెడ్‌రూమ్, కిచెన్, బాత్‌రూమ్ వంటి విభాగాల పరిమాణాల రూపకల్పనలో వాస్తు అంశాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పేద కుటుంబాలు సంతోషంగా, ఆత్మగౌరవంతో జీవించేలా ప్రతి డిజైన్ ఉండాలన్నారు. పార్కింగ్‌తో పాటు షాపుల ఏర్పాటుకు కూడా అవకాశం కల్పించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని, ఆ నియోజకవర్గ ప్రజలకు అదే ప్రాంతంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని అధికారులకు సూచించారు. ప్రజలు తమ ఉపాధి, జీవన విధానాలకు దూరం కాకుండా నివాసాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో చర్చించిన అనంతరం తుది డిజైన్లను ఖరారు చేసి, యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించేలా రోజువారీ కార్యాచరణ రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రతి పేద కుటుంబానికి సొంతింటి భద్రత కల్పించాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచే అర్బన్ హౌసింగ్ మోడల్‌ను తీసుకొస్తోందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.

## 31న కార్మికులందరూ డిమాండ్ డేను పాటించాలి

కేవలం విలీన తేదీని ప్రకటించాల్సిన సమయంలో ప్రభుత్వాలు మారాయని తెలిపారు. ఇటీవల ఆర్టీసీ సమ్మె సందర్భంగా మంత్రులతో కూడిన ఉపసంఘం ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయటానికి అధికారికంగా ప్రకటన చేశారని తెలిపారు. ఇటీవల విలీనం కంటే ముందు ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించటంతో కార్మికుల్లో తీవ్ర గందరగోళం నెలకొన్నదని అన్నారు. ఆర్టీసీ విలీనానికి అపాయింటెడ్ తేదీని తెలంగాణ ఆవిర్భావ దినమైన జూన్ 2న ముఖ్యమంత్రి ప్రకటించాలని కోరుతూ మే 31 న సింగిల్ డిమాండ్ పై రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపో, యూనిట్లలో ఎర్ర బ్యాడ్జీలు ధరించి డిమాండ్ డే పాటించాలని పిలుపునిచ్చారు.

## కాలుష్య రహితంగా గోదావరి పుష్కరాలు

దీని కోసం జూన్ 25 లోపు పూర్తి స్థాయి నివేదికతో 'స్వచ్ఛ గోదావరి' ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను పవన్ ఆదేశించారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో ఆరు జిల్లాల పరిధిలో 262 పుష్కర పంచాయతీలను గుర్తించారు. వీటిని మురుగురహిత పంచాయతీలుగా తీర్చిదిద్దాలని, మురుగునీరు నేరుగా గోదావరిలో కలవకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. మురుగు నీటి నిర్వహణ, పారిశ్రామిక వ్యర్థాల కాలుష్యంపై పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. పరిశ్రమల వ్యర్థాలు నదిలో కలవకుండా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కఠినంగా వ్యవహరించాలని, మురుగు నీటిని శుద్ధి చేశాకే నదిలోకి వదలాలని పవన్ స్పష్టం చేశారు. మున్సిపాలిటీ సామర్థ్యానికి తగిన విధంగా మురుగు శుద్ధి ప్లాంట్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. పీసీబీ మంజూరు చేసిన రూ.100 కోట్ల నుంచి కూడా నిధుల వినియోగించాలని డిప్యూటీ సిఎం ఆదేశించారు. రోజువారీ 104 మిలియన్ లీటర్ల మురుగు నీరు జీవనదిని కలుషితం చేస్తోందన్నారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల నుంచి 8.38 మిలియన్ లీటర్ల మురుగు నీరు గోదావరిలో కలుస్తోందని పేర్కొన్నారు. పారిశ్రామిక వ్యర్థాల్లో ఆంధ్ర పేపర్ మిల్లు వెదజల్లే రోజువారీ కాలుష్యమే 32 మిలియన్ లీటర్లు ఉంటుందన్నారు. నిత్యం గోదావరిలో కలిసే 13.24 మిలియన్ లీటర్ల ఆక్వా కాలుష్యం వీటికి అదనమని పేర్కొన్నారు. పారిశ్రామిక కాలుష్య నివారణకు నిరంతర తనిఖీలు చేయాలని సూచించారు. ఆర్టీజీఎస్ తరహా కంట్రోల్ రూం ద్వారా నిరంతరం ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణ టాస్క్ ఫోర్స్‌కి కంట్రోల్ రూం నిర్వహణ బాధ్యతలను అప్పగించారు.

## రెండ్రోజల మహానాడు దిగ్విజయం

**స్త్రీ శక్తి థీమ్‌కు అర్థం చెప్పేలా 33 శాతం రిజర్వేషన్లు**

**విజయవంత చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేనా కృతజ్ఞతలు**

**మహానాడు విజయవంతంపై మీడియాతో మంత్రి లోకేశ్**

అమరావతి, నినాదం: తెలుగుదేశం పార్టీ రెండు రోజుల పాటు నిర్వహించిన మహానాడు 2026 విజయవంతంగా పూర్తయింది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి నారా లోకేశ్ శుక్రవారం స్పందించారు. మహానాడు 2026 విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని తెలిపారు. స్త్రీ శక్తి థీమ్‌కు అసలైన అర్థం చెప్పేలా మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చేసిన తీర్మానానికి అందరి ఆమోదం లభించడం.. ఇది దేశవ్యాప్తంగా చర్చనీయాంశం కావడం ఈ మహానాడు సాధించిన మరో గొప్ప విజయం అని మంత్రి నారా లోకేశ్ అభివర్ణించారు. కార్యకర్తలే అధినేత నినాదాన్ని పార్టీ జాతీయ అధినేత అమలు చేసిన ఈ మహానాడు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. రెండు రోజుల మహానాడుకు ఒక్క మైటీడీపీ యాప్‌లో 24.50 లక్షల డిజిటల్ అటెండెన్స్ నమోదు కావడం మరో రికార్డు అని తెలిపారు. తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు, మహానాడు కమిటీలు, పార్టీ కార్యాలయ యంత్రాంగం, బ్యాక్ ఆఫీస్, సాంకేతిక సిబ్బంది, ఓజిఆఖ, , అనుబంధ సంఘాలు, మీడియా మిత్రులు, సోషల్ మీడియా అభిమానులు, ఎనఆరఐలు, మిత్రపక్షాలు, ప్రజలు, భద్రతా సిబ్బంది అందరికీ కృతజ్ఞతాభి వందనాలు తెలిపారు. మహానాడు 2026 విజయం మీ అందరికీ అంకితం చేస్తున్నానని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. ఇది మీవిజయం అని మంత్రి లోకేశ్ వెల్లడించారు మీకృషికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని చెప్పారు. తెలుగుదేశం పార్టీ కోట్లాది కుటుంబసభ్యుల ఆశీస్సులతో తాను టీడీపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎంపికైన తర్వాత జరిగిన తొలి మహానాడు ఇదని ఆయన వివరించారు. ఈ మహానాడు ఘన విజయం టీడీపీ టీం కృషి అని స్పష్టం చేశారు. సమష్టిగా పనిచేస్తే ఎన్ని అద్భుతాలు చేయగలమో టీడీపీ కుటుంబం నిరూపించిందని పేర్కొన్నారు.

# మహనీయుల విగ్రహాల ప్రతిష్టాపనలో ఇబ్బందులను సత్వరమే పరిష్కరించండి

**హైదరాబాద్, మే 29(నినాదం):**

మహాత్మా జ్యోతిబా పూలే, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబూ జగజీవన్ రామ్ వంటి మహనీయుల విగ్రహాల ప్రతిష్టాపనలో ఎదురవుతున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల, తెగల సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. మహనీయుల విగ్రహాలు కేవలం శిల్పాలు కావని, అవి సామాజిక చైతన్యానికి, స్వాభిమానానికి, రాజ్యాంగ విలువలకు ప్రతీకలని పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం దళితులు, గిరిజనులు, బీసీ వర్గాల సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధికి అత్యంత కట్టుబడి పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. సమాజంలోని అణగారిన వర్గాలకు గౌరవప్రదమైన స్థానం కల్పించడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ మేరకు హైదరాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలో మహనీయుల విగ్రహాల ప్రతిష్టాపనలో ఎదురవుతున్న ఇబ్బందులపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం మధ్యాహ్నం మంత్రి అధ్యక్షతన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దళిత సంఘాల ప్రతినిధులు, యువకులు, ప్రజా సంఘాల నాయకులు విగ్రహాల ఏర్పాటుకు సంబంధించి ఎదురవుతున్న స్థల సమస్యలు, అనుమతుల జాప్యం, స్థానిక స్థాయిలో తలెత్తుతున్న అభ్యంతరాలు, పోలీసు అనుమతులు, రెవెన్యూ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... మహనీయుల ఆశయాలను గ్రామస్థాయి నుంచి యువతలోకి తీసుకెళ్లే ప్రక్రియలో విగ్రహాల ప్రతిష్టాపనకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. ప్రజల భావోద్వేగాలకు సంబంధించిన అంశాలలో అధికారులు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రాహుల్ గాంధీ చేపట్టిన "భారత్ జోడో యాత్ర" దేశంలో సామాజిక ఐక్యత, రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం లక్ష్యాలతో సాగిందని మంత్రి పేర్కొన్నారు. ఆ యాత్రలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా జ్యోతిబా పూలే, బాబూ జగజీవన్ రామ్ వంటి మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లే స్ఫూర్తి ప్రతిబింబించిందన్నారు. సమానత్వం, సోదరభావం, హక్కుల పరిరక్షణ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాల మూలాధారమని చెప్పారు. విగ్రహాల ప్రతిష్టాపనలో ఎలాంటి అనవసర జాప్యం జరగకుండా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, జీహెచ్ఎంసీ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను చట్టబద్ధంగా, సామరస్యపూర్వకంగా పరిష్కరించాలని సూచించారు. నియమ నిబంధనలకు అనుగుణంగా లేని స్థలాల విషయంలో ముందుగానే సంబంధిత సంఘాలకు స్పష్టమైన నోటీసులు ఇవ్వాలని అధికారులకు సూచించారు. చివరి నిమిషంలో అభ్యంతరాలు వ్యక్తం చేయడం వల్ల ఉద్రిక్త పరిస్థితులు తలెత్తే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, దళిత సంఘాలతో చర్చించి ముందస్తు పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనవసరంగా దళిత సంఘాల నాయకులపై కేసులు నమోదు చేయడం సరికాదని మంత్రి స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారంపైనే ప్రధాన దృష్టి పెట్టాలని, శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ప్రజల



మనోభావాలను గౌరవించాలని అధికారులకు సూచించారు. ఎక్కడైనా వివాదాస్పద పరిస్థితులు నెలకొంటే వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ప్రభుత్వం రాజ్యాంగ విలువలకు కట్టుబడి పనిచేస్తోందని, మహనీయుల ఆశయాల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని మంత్రి స్పష్టం చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చూపిన రాజ్యాంగ మార్గం, మహాత్మా పూలే సూచించిన సామాజిక సమానత్వ భావన, బాబూ జగజీవన్ రామ్ అందించిన ప్రజాస్వామ్య స్ఫూర్తి రాష్ట్ర ప్రభుత్వానికి మార్గదర్శకాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ (వెల్ఫేర్) సభ్యసాచి ఘోష్, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మనోజ్ చౌదరి, ఉప్పల్ డీసీపీ సురేష్ కుమార్, హైదరాబాద్ డీసీపీ–II కాజల్, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రారెడ్డి, ఏసీఎల్‌బీ జి. జితేందర్ రెడ్డి, ఎస్సీడీడీ వీసీ & ఎండీ (ఎఫ్ఏసీ) హనుమంత్ నాయక్, ఎస్సీడీడీ డిప్యూటీ డైరెక్టర్ ప్రవీణ్ రెడ్డి, రామారావు, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ సంతోష్, ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతో, ఎల్‌బీనగర్ సీపీ శ్రీనివాస్ యాదవ్, సైబరాబాద్ ఎస్‌బీ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర, ఓఎస్డీ వై .జే. విజయ్ కుమార్ తదితర అధికారులతో పాటు ఎస్సీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు దొమ్మాటి సుదర్శన్ బాబు, మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల రాం ప్రసాద్, కళానిధి మాస్టర్ జీ, నల్ల సూర్యప్రకాశ్, సొసైటీ ఫర్ సోషల్ జస్టిస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి జీటీ శేఖర్, ఆల్ ఇండియా ఎస్సీ/ఎస్టీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఎస్. నాను, జి.బి. శ్యామ్ రావు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ & బాబూ జగజీవన్ రామ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గోపాల్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వీకర్ సెక్షన్ అసోసియేషన్ (ఆదర్శనగర్) తాలూకా అనిల్, ఎస్సీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ కుర్మల్‌గూడ నాయకులు సంగం మహేష్, కుర్మ మహేందర్, రాపాక అశోక్ తదితర దళిత సంఘాల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతోనే కొంటాం

రైతులకు నష్టం లేకుండా ప్రత్యేక చర్యలు

మొక్కజొన్న భారీ దిగుబడి.. నిల్వలకు ప్రత్యేక ఏర్పాట్లు

కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

రైతులకు నమ్మకం కలిగించే విధంగా మీడియా సహకారం అవసరం

నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



**నాగర్ కర్నూల్ మే 29 ( నినాదం):** ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా రైతులు ఎదుర్కొన్న నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని, తడిసిన ప్రతి గింజను కూడా ప్రభుత్వ మద్దతు ధర (మీరా) ప్రకారం కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ వెల్లడించారు. ఈ విషయంపై మీడియా ప్రతినిధులు కూడా రైతులకు సరైన సమాచారం చేరవేసి అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు. ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు కట్టుబడి ఉందని, తడిసిన ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి అపోహలు నమ్మవద్దని రైతులకు తెలియజేయాలని సూచించారు. రైతులకు నమ్మకం కలిగించే విధంగా మీడియా సహకారం అవసరమని జిల్లా కలెక్టర్ కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో వరి, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియపై ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అదనపు కలెక్టర్ అమరేందర్, తో కలిసి కలెక్టర్ ఈ వివరాలను వెల్లడించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల ముఖ్యంగా కోత దశలో ఉన్న వరి పంట తీవ్రంగా దెబ్బతిందని, రైతులు ఆందోళనకు గురయ్యారని ఆయన తెలిపారు. రైతుల ఇబ్బందులను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 35 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేయగా, ఇంకా లక్ష మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేయాల్సి ఉందని కలెక్టర్ వెల్లడించారు. ఇందుకోసం అవసరమైన కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఇతర జిల్లాల్లో 90 శాతం కొనుగోళ్లు పూర్తయినప్పటికీ నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇంకా కోతలు పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదని పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందన్నారు. జిల్లాలో మొక్కజొన్న దిగుబడి గణనీయంగా పెరిగిందని, సాధారణంగా ఎకరానికి 25 టన్నులు రావాల్సి ఉండగా ఈసారి 50 నుంచి 60 టన్నుల వరకు దిగుబడి వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు 1,75,000 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేశామని, ఇంకా రైతుల వద్ద ఉన్న దిగుబడిని కొనుగోలు చేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. మొక్కజొన్న భారీ దిగుబడి రావడంతో రవాణా, కూలీల, నిల్వ, సమస్యలు తలెత్తుతున్నాయని, ఇప్పటికే జిన్నింగ్ మిల్లుల్లో నిల్వలు ఏర్పాటు చేశామని తెలిపారు. అవసరమైతే ప్రత్యేక అధికారాలతో ఫంక్షన్ హాళ్లను కూడా తాత్కాలిక గోదాములుగా వినియోగిస్తామని స్పష్టం చేశారు. తడిసిన ధాన్యానికి కూడా నాణ్యత ప్రమాణాల్లో కొంత సడలింపుతో కొనుగోలు చేపడుతున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులు నష్టపోకుండా వారికి న్యాయమైన ధర అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అవకతవకలు జరగకుండా కఠిన పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో వరి, మొక్కజొన్న కొనుగోళ్లను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. రైతులు తమ ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి నమోదు చేసుకోవచ్చని సూచించారు. రసీదుల జారీ, తూకం, నిల్వ, రవాణా వంటి అన్ని దశల్లో స్పష్టమైన విధానాలు అమలు చేస్తామని తెలిపారు. మధ్యవర్తుల జోక్యాన్ని పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, నీడ, తాత్కాలిక వసతులు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. మండల స్థాయి అధికారులు ప్రతి రోజు కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షిస్తూ నివేదికలు సేకరిస్తారని, రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. అలాగే జిల్లాలో వరి, మొక్కజొన్న కొనుగోళ్లకు అవసరమైన గన్ని బ్యాగుల నిల్వ పూర్తిగా అందుబాటులో ఉందని, అవసరానికి 20 శాతం అదనపు స్టాక్ కూడా సిద్ధంగా ఉంచినట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. రైతుల ధాన్యం కొనుగోలుకు సంచుల కొరత లేదని తెలిపారు.

## అడ్డగోలుగా పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి

-మోయలేని భారాలతో ఆటో కార్మికుల జీవితాలు ఛిన్నాభిన్నం చేస్తున్న కేంద్రం

-ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల జమలయ్య



**కొత్తగూడెం, మే29(నినాదం):** అడ్డగోలుగా పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని ఏఐటీయూసీ అనుబంధ ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల జమలయ్య డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు నిరసనగా యూనియన్ ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణంలోని ఆటో కార్మికులు శుక్రవారం వినూత్న నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని పోస్టాఫీసు సెంటర్ నుంచి బస్టాండు సెంటర్ వరకు అర్ధ నగ్నంగా ఆటోలకు తాడుకట్టి లాగుతూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ స్వయం ఉపాధిపై ఆధారపడి జీవిస్తున్న ఆటో కార్మికులపై కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మోయలేని భారం మోపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తూ పేదలను నట్టేట ముంచుతోందని తీవ్ర స్థాయిలో విమర్శించారు. కేవలం 11 రోజుల్లోనే ఐదు సార్లు డీజిల్ ధర పెంచి ఆటో కార్మికుల నడ్డివిరిచారని మండిపడ్డారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను అదుపు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. లాక్‌డౌన్ కష్టాల నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ఆటో కార్మికులను ఈ ధరల పెరుగుదల మరింత కుంగదీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పెంచిన ఎక్సైజ్ సుంకాలను తగ్గించి, కార్మికులను ఆదుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మర్రి కృష్ణ, అబ్బులు, మంద శ్రీను, బాబు జానీ, ఆరెల్లి, కృష్ణ, రాంబాబు, దేశీ, బడుగు భాస్కర్, చింటూ, లక్ష్మణ్, సంపత్, విజ్జి, మండల రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## దేశానికి సేవ చేసే వారిని గౌరవించుకోవడం మన బాధ్యత

-మాజీ మున్సిపల్ చైర్మన్ ముక్క దేవేందర్ గుప్తా



**నిజామాబాద్ ప్రతినిధి, మే 29 (నినాదం) :** సైనికులు మన గురించి వారి కుటుంబాలను వదిలి దేశ సరిహద్దులు కాపలా కాస్తుంటే, రైతులు మానవాళి ఆకలిని తీర్చి ఆరుగాలం కష్టం చేసి శ్రమించి మనకు ఆహారాన్ని అందిస్తున్నారని, దేశానికి సేవ చేసే వీరిని గౌరవించుకోవడం మనందరి బాధ్యత అని ముక్క దేవేందర్ గుప్తా అన్నారు. మారుతి నగర్ లోని స్నేహ సొసైటీ రూరల్ రీ కన్స్ట్రక్షన్ ప్రత్యేక పాఠశాలలో టిఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జై జవాన్ జై కిసాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేశ సైన్యంలో పని చేసిన మాజీ సైనికులు గూడా శ్రీనివాసరెడ్డి, షేక్ మహమ్మద్, అదే విధంగా రైతులు ఎం.వెంకట్ రెడ్డి, మద్దిపూడి చక్రవర్తి లను ఘనంగా సన్మానించారు. స్నేహ సొసైటీ కార్యదర్శి ఎస్. సిద్దయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ మున్సిపల్ చైర్మన్ ముక్క దేవేందర్ గుప్తా, మాయావర్ రాజేశ్వర్, డాక్టర్ ముక్క వినోద్ గుప్త హాజరయ్యారు. ఈ సందర్భంగా టిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ తాటి వీరేశం మాట్లాడుతూ ఇంత వరకు 85 మంది సైనికులను, రైతులను సన్మానించామని, అతి త్వరలోనే 100 మందిని సన్మానించి ఒక మహా సభ ఏర్పాటు చేయటానికి కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో తాటి సుధాకర్ గుప్తా, కే.నరసింహారావు, టి.జితేందర్ రెడ్డి, చల్ల గంగాధర్, స్నేహ సొసైటీ ప్రిన్సిపాల్ జ్యోతి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, స్నేహ సొసైటీ రాజశేఖర్ హాజరయ్యారు.

## బట్టాపూర్ బ్రిడ్జిని ఢీ కొట్టిన మొరం ట్రాక్టర్



**ఆర్మూర్ మే 28 ( నినాదం):** బాల్కొండ నియోజకవర్గం ఏర్గట్ల మండలంలోని బట్టాపూర్ గ్రామం నుండి వెల్కటూర్ గ్రామం కు ట్రాక్టర్ నెంబర్ టి. జి.16. సి. 62 06 నంబర్ గల ట్రాక్టర్ మొరం తరలించుకు వెళ్తుండగా భట్టాపూర్ -వెల్కటూర్ గ్రామాల మధ్య గల బ్రిడ్జికి ఢీకొనడంతో ట్రాక్టర్ ట్రైలర్ బ్రిడ్జిపై ఉందని, ఇంజన్ మాత్రం వంతెన లోపలికి వేలాడుతుందని ఏరుగట్ల మండల తాసిల్దార్ మల్లయ్య శుక్రవారం విలేకరులతో తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ పల్లపు శేఖర్ ఖానాపూర్ మండలం తర్లపాడు గ్రామానికి చెందిన డ్రైవర్ కు చేయి విరిగిందని తెలిపారు. వెంటనే చికిత్స నిమిత్తం ట్రాక్టర్ డ్రైవర్ ను నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని తాసిల్దార్ మల్లయ్య తెలిపారు.

## హ్యూమన్ రైట్స్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా దాసరి మూర్తి

సన్మానించిన ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు



**ఆర్మూర్ మే 28 (నినాదం):** బాల్కొండ నియోజకవర్గం మెండోరా మండల కేంద్రానికి చెందిన దాసరి మూర్తి కి హ్యూమన్ రైట్స్ కమిటీలో నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా మెండోరా గ్రామస్తులు ఆయనను ఘనంగా సన్మానించారు. దాసరి మూర్తి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ చైర్మన్‌గా సేవలందిస్తూ బీసీల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని గ్రామస్తులు కొనియాడారు. మానవ హక్కుల కమిటీలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపిక కావడం పట్ల గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జాతీయ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ చైర్మన్ మామిడాల మనోహర్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ప్రకారం ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, స్వేచ్ఛ కల్పించబడినట్లు తెలిపారు. ఇతరుల హక్కులకు భంగం కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అలాగే 1948 డిసెంబర్ 10న ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల దినోత్సవాన్ని ప్రకటించిందని, ప్రతి సంవత్సరం డిసెంబర్ 10న మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. దాసరి మూర్తి మాట్లాడు తూ, ప్రజలకు అన్ని విధాలుగా సేవలు అందిస్తానని, ఎప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. తనకు మద్దతుగా నిలిచిన గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బడాల సాయిరెడ్డి , మామిడాల మనోహర్ కు శాలువాతో సత్కరించగా, ఉపసర్పంచ్ మిట్టపల్లి రాజేశ్వర్ దాసరి మూర్తి ని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీసీ మండల అధ్యక్షుడు గుర్రం మహేశ్వర్, ఉపాధ్యక్షుడు బర్గెడి మహేందర్, ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షుడు మాకూరి మహేష్, బీసీ నాయకులు మెట్ల రాజేశ్వర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్



**కామారెడ్డి, మే 29:-(నినాదం ప్రతినిధి):** జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం బీబీపేట మండలంలోని వరి ధాన్య కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. కేంద్రానికి రైతులు తీసుకొచ్చిన ధాన్యం నాణ్యత, తూకం విధానం, హమాలీ సౌకర్యాలు, రవాణా ఏర్పాట్లపై ఆరా తీశారు. అకాల వర్షాల నేపథ్యంలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్లు, అవసరమైన రక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగవంతంగా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. కేంద్రంలో ధాన్యం నిల్వ విధానం, ఆన్‌లైన్ నమోదు, టోకెన్ వ్యవస్థ, చెల్లింపుల వివరాలను పరిశీలించిన కలెక్టర్, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించాలని అధికారులకు సూచించారు. రైతులు తీసుకొచ్చిన ప్రతి ధాన్యపు గింజకు సరైన మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కలెక్టర్ వెంట సివిల్ సప్లయ్ అధికారి వెంకటేశ్వర్లు, డీఎం. శ్రీకాంత్, డిసిఓ రామ్ మోహన్, సంబంధిత అధికారులు, కొనుగోలు సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో వాహనాలకు వేలంపాట

**కల్వకుర్తి మే 29 (నినాదం):** పట్టణంలో నాగర్ కర్నూల్ జిల్లా ఎక్సైజ్ అధికారి గా యత్రి సమక్షం లో నేడు ఉదయం 10 గంటలకు పట్టణంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో మో టార్ వెహిక ల్స్‌కు వేలం పాట నిర్వ హించడం జరుగుతుంది. మద్యం, సరుకుల రవాణా, ని ఘా, వాహనాల జప్తు చేయబడిన వాహనాలకు ఎక్సైజ్ శాఖ ఆధ్వ ర్యంలో రవాణాను అరికట్టడా నికి చట్టబద్ధమైన మద్యం సరఫరాను పరిశీలిం చడానికి ఎక్సైజ్ శాఖ వాహనాలు జప్తు చేయడం జరిగింది.

## కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లెల లక్ష్మణ్‌కు ఘన సన్మానం



**ఆర్మూర్ మే 28 ( నినాదం):** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం భీంగల్ పట్టణంలోని లండన్ కిడ్స్ స్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం సభ్యులు, పలువురు ప్రముఖులు శుక్రవారం రోజున నూతన భీంగల్ మండల అధ్యక్షుడు పార్టీ అధ్యక్షులు మల్లెల లక్ష్మణ్,పట్టణ అధ్యక్షుడు పర్స అనంతరావు లను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సేవలో ఆయన చేస్తున్న కృషిని కొనియాడుతూ, పలువురు నాయకులు ప్రశంస జల్లులు కురిపించారు. ఈ సందర్భంగా మల్లెల లక్ష్మణ్ మాట్లాడుతూ, తనకు అందించిన గౌరవానికి స్కూల్ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల అభివృద్ధికి, విద్యాసంస్థలు చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం సభ్యులు, న్యాయవాది గజ్జల చైతన్య, డా. పడాల పురేందర్, పర్సా నవీన్, కొమ్ము భూమేశ్వర్, నీలకంఠం, కర్నె లక్ష్మణ్, శివచరణ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్కూల్ ఉపాధ్యాయుల బృందం, సిబ్బంది హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## న్యూ లక్ష్మీపురంలో భారీ అగ్ని ప్రమాదం



**మధిర, మే 29 (నినాదం):** మధిర నియోజకవర్గం ముదిగొండ మండల పరిధిలోని న్యూ లక్ష్మీపురం గ్రామంలో జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో లక్షల రూపాయల కు పైగా ఆస్తి నష్టం వాటిల్లింది. పంట పొలాల్లోని వ్యర్థాలకు నిప్పు పెట్టవద్దని ప్రభుత్వం, అధికారులు ,పదేపదే హెచ్చరిస్తున్నప్పటికీ, ఓ రైతు తన మొక్కజొన్న కొయ్యలకు నిప్పు పెట్టడంతో మంటలు అదుపుతప్పి పక్కనున్న ఆస్తులకు మంటలువ్యాపించాయి. ఈ ఘటనలో గ్రామానికి చెందిన కోరట్ల శివ కు చెందినఆటోమొబైల్ పంచర్ షాప్ లో నిల్వ ఉంచిన లక్షల విలువైన పాత, కొత్త టైర్లు, ట్యూబులు, రీ-బటన్ టైర్లు, డిస్కులు పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యాయి. అలాగే వడ్డెపూడి ఎల్లయ్యకు చెందిన వరిగడ్డి కట్టలు, దగ్ధమై వేల రూపాయల నష్టం వాటిల్లగా, ఎలగందుల సాయిబాబా పొలంలోని చెట్లు, వ్యవసాయ మోటారు వైర్లు ,కాలిపోవడంతో మరికొంత నష్టం వాటిల్లినట్లు సమాచారం. ఈ సమాచారం అందుకున్న ఖమ్మం అగ్నిమాపక దళం కేవలం 20 నిమిషాల్లో ఘటనా స్థలికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చింది. అగ్ని పక్కనే ఉన్న ఇళ్లకు, ఇతర వారి గడ్డివాములకు వ్యాపించకుండా, అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ అగ్నిమాపక చర్యల్లో ఖమ్మం స్టేషన్ ఫైర్ ఆఫీసర్ బి కోదండరామిరెడ్డి, లీడింగ్ ఫైర్ ఫైటర్ పి. కిరణ్ కుమార్, ఫైర్ ఫైటర్ అండ్ టెక్నికల్ వి. రాంబాబు, ఫైర్ ఫైటర్లు పి. భాస్కర్, జి. అశోక్ తదితర సిబ్బంది పాల్గొన్నారు ఈ ఘటనపై బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ముమ్మరం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే దిశగా విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం.

## చేనేత మగ్గాలను పరిశీలించిన కలెక్టర్



**నారాయణపేట ప్రతినిధి, మే 29, (నినాదం):** జిల్లా కేంద్రంలోని గాంధీ నగర్ వీధిలో గల చేనేత సహకార సంఘం (లిమిటెడ్ ) కార్యాలయంలో చేనేతే మగ్గాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక పరిశీలించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు ఏ విధంగా మగ్గాలను నేస్తున్నారు ? వారికి రోజువారీ కూలీ ఎంత చెల్లిస్తున్నారని చేనేత జౌళి శాఖ అధికారి బాబును అడిగి తెలుసుకున్నారు. మగ్గం పై ఓ చేనేత కార్మికురాలు నేస్తున్న కాటన్ చీరను ఆమె పరిశీలించారు. చేనేత కార్మికుల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే జిల్లాలో ఉన్నటువంటి మొత్తం సంఘాలకు,చేనేత కార్మికులకు ప్రభుత్వం ద్వారా ఏ ఏ పథకాలు అమలు జరుగుతున్నాయని ఏ డీ ని ప్రశ్నించగా నేతన్న పొదుపు, నేతన్న భద్రత, నేతన్న భరోసా, క్లస్టర్ డెవలప్మెంట్ స్కీములు, క్యాష్ క్రెడిట్, వ్యక్తిగత రుణాల మాఫీ చేనేత కార్మికులకు వర్తిస్తుందని ఏ డీ బాబు కలెక్టర్ కు వివరించారు. నేత కార్మికులు చేతితో నేసిన నారాయణపేట కాటన్ చీరను జిల్లా కలెక్టర్ కొనుగోలు చేశారు.

## నాణ్యత ప్రమాణాలతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టాలి

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఇబ్బందులు ఉంటే అధికారులకు తెలియజేయాలి

పాలెం గ్రామంలో ఇందిరమ్మ

ఇండ్ల నిర్మాణాలను పరిశీలించిన నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్

హేమంత కేశవ్ పాటిల్



**నాగర్ కర్నూల్ మే 29 (నినాదం):** నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని బిజినపల్లి మండలం పాలెం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ శుక్రవారం ఉదయం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు బోనాసి జ్యోతి శిరీష, గౌరమ్మల ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, నిర్మాణ పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నా యని అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్న కలెక్టర్, ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సమర్థవంతంగా వినియోగించుకొని నాణ్యత ప్రమాణాలతో ఇండ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. నిర్మాణ పనుల్లో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసు కురావాలని తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదా రులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు శాశ్వత నివాస సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి అర్హ కుటుంబం గౌరవప్రదమైన జీవనం గడపడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇంటి నిర్మాణాన్ని సమయానికి పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. అంతే కాకుండా గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, మౌలిక వసతుల పరిస్థితిని కూడా కలెక్టర్ పరిశీలించారు. గ్రామ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని, వాటి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట బిజినపల్లి మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచ్, గ్రామపంచాయతీ అధికారులు, హౌసింగ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలి



**గద్వాల బ్యూరో మే 29 (నినాదం):** ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) మధుమోహన్ అన్నారు. శుక్రవారం ధరూరు మండలం భీంపురం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలు కురుస్తున్నందున కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టిన ధాన్యం తడవకుండా టార్పాలిన్ లు కప్పి ఉంచాలన్నారు. కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తి చేసేందుకు తేమ శాతంను పరిశీలించి ఎప్పటికప్పుడు తూకం చేసి మిల్లులకు తరలించాలని సంబంధిత కేంద్రం ఇన్చార్జ్‌లకు సూచించారు. లారీల కొరత లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అదేవిధంగా రైతుల ఖాతాల్లో సకాలంలో డబ్బులు జమ అయ్యేలా ధాన్యం కొనుగోలు చేసిన రోజే ఓపిఎంఎస్ ను ఆన్లైన్లో ఎంటర్ చేయాలని ఆదేశించారు. అలాగే గన్ని సంచులు కొరత లేకుండా చూడాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో ధరూరు తహసిల్దార్ నందిని, కేంద్రం సిబ్బంది, తదితరులున్నారు.

## టిపిటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




**కామారెడ్డి, మే 29:-(నినాదం ప్రతినిధి):** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో 12వ టిపిటి ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుక లను శుక్రవారం నిర్వహించారు. ఆవిర్భావ దినోత్సవ సందర్భం గా జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు చింతల లింగం టిపిటి ఎఫ్ పతాకావిష్కరణ చేసారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడు తూ... టీపీటీఎఫ్ ఎప్పుడు ఉపాధ్యాయుల సమస్యల కోసం పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఫెడరేషన్ నాయకులు శ్రీనివాస్, అంజయ్య, జిల్లా ఉపాధ్యక్షులు నళిని మేడం, శ్రీనివాస్, జిల్లా కార్యద ర్శులు నరేందర్ గోపు శ్రీనివాస్, మం గమ్మ, కామారెడ్డి మండల అధ్యక్షులు గ్యార బాబయ్య పాల్గొన్నారు.

## మెడికల్ అకాడమీల ముసుగులో ఇంటర్ అడ్మిషన్లు

విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం

పర్మిషన్ లేని అకాడమీలపై చర్యలు తీసుకోండి : ఎస్ఎఫ్ఐ



**ఖమ్మం ప్రతినిధి,మే 29: (ని నాదం):** మెడికల్ అకాడమీలు, కోచింగ్ సెంటర్ల పేర్లతో రెగ్యులర్ ఇంటర్ అడ్మిషన్లు నిర్వహిస్తున్న సంస్థలపై తక్షణ చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఖమ్మం నగర ముఖ్య కార్యకర్తల సమావేశం నగర కేంద్రం లోని సుందరయ్య భవన్‌లో నిర్వహించారు. ఈ సం దర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ ఖమ్మం నగరవ్యా ప్తంగా అనేక మెడికల్ అకాడమీలు, కోచింగ్ సెంటర్లు అడ్డగోలుగా బోర్డులు ఏర్పాటు చేసి, గుర్తింపు లేకుండానే రెగ్యులర్ ఇంటర్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నా యని ఆరోపించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులను తప్పుదోవ పట్టిస్తూ లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని విమర్శించారు. 2019 సంవత్సరం నుంచి కొత్తగా ఎలాంటి జూనియర్ కళాశాలలకు అనుమతులు ఇవ్వలేదని జిల్లా విద్యాశాఖ అధికారులు చెబుతున్నప్పటికీ, పర్మిషన్ లేకుండా అడ్మిషన్లు చేస్తున్న సంస్థలపై మాత్రం చర్యలు తీసుకోవడం లేదన్నారు. కొన్ని అకాడమీలు తాము ఇతర కాలేజీల అనుమతులు కొనుగోలు చేశామని చెబుతూ తల్లిదండ్రుల ను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి అక్రమంగా అకాడమీలు నిర్వహిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, ఆయా సంస్థలను మూసివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనలు చేపట్టి, అక్రమ సంస్థలను మూసివేసే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

## మహేశ్వరి రైస్ మిల్‌లో ధాన్యం దిగుబడి తీరును పరిశీలించిన కలెక్టర్



**కామారెడ్డి, మే 29:-(నినాదం ప్రతినిధి):** కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం బీబీపేట్ మండలంలోని మహేశ్వరి రైస్ మిల్‌ను సందర్శించి ధాన్యం దిగుబడి తీరును పరిశీలించారు. మిల్లుకు చేరుతున్న ధాన్యం నాణ్యత, తూకం ప్రక్రియ, నిల్వ విధానం, సీఎంఆర్ బియ్యం తయారీ పురోగతిపై ఆరా తీశారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే అన్‌లో డింగ్ చేసి మిల్లింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని మిల్లర్లకు సూచించారు. అకాల వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ధాన్యం తడవకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ధాన్యం దిగుబడి శాతం, రికవరీ వివరాలు, సీఎంఆర్ లక్ష్యాల పురోగతిని పరిశీలించిన కలెక్టర్, ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యమైన బియ్యాన్ని నిర్దేశిత గడువులోగా అందజేయాలన్నారు.

# ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే

**రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా**

**కేసీఆర్ కిట్ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్**

**జమ్మికుంట, మే 29 (నినాదం) :** హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. గర్భిణీ స్త్రీలు, డెలివరీ అయిన మహిళలను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ... కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో డెలివరీ అయిన మహిళలకు "కేసీఆర్ కిట్" అందించేవారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకాన్ని నిలిపివేసిందని విమర్శించారు. వెంటనే కేసీఆర్ కిట్ పథకాన్ని తిరిగి అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల మందులు అందు బాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ఆసుపత్రి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని అన్నారు. రోగుల పట్ల వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించబోమని హెచ్చరించిన ఎమ్మెల్యే, హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి మరిన్ని ఆధునిక వైద్య పరికరాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే సరిపడా వైద్య సిబ్బందిని



వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండా శ్రీనివాస్ కే డి సి సి బ్యాంకు ఐ చైర్మన్ పింగళి రమేష్ నాయకులు గందె శ్రీనివాస్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగొద్దు

**పీఏసీఎస్ చైర్మన్ సోమశాంత కుమార్**

**మహాముత్తారం, మే 29(నినాదం):** రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల్లో దాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ సోమశాంత కుమార్ ఆదేశించారు. మండలంలో పిఏసిఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. కొనుగోలు ప్రక్రియ, ధాన్యం నిల్వలు, రవాణా పై ఆరా తీశారు. ధాన్యం కొనుగోలులో జాప్యం వహించవద్దని, కొనుగోలు, రవాణా త్వరితగతిన పూర్తిచేయాలని కేంద్రాల నిర్వహకులకు సూచించారు. రైతులు ఆందోళన చెందవద్దని ధాన్యం పూర్తయ్యే వరకు కొనుగోలు జరుగుతాయని అన్నదాతలకు చైర్మన్ భరోసా కల్పించారు. ఆయన వెంట పిఏసిఎస్ అధికారులు సిబ్బంది ఉన్నారు.



## ఓటరు జాబితాల సవరణకు

# జిల్లా యంత్రాంగం సిద్ధం



**డూప్లికేట్ ఓటర్లపై ప్రత్యేక పరిశీలన**

**అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటరు నమోదు లక్ష్యం**

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**

**నాగర్ కర్నూల్ మే 29 (నినాదం) :** నాగర్ కర్నూల్ జిల్లాలో జూన్ 15వ తేదీ నుండి నిర్వహించనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేసేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు. శుక్రవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో నాగర్ కర్నూల్ జిల్లా నుంచి పాల్గొన్న కలెక్టర్, జిల్లాలో చేపట్టనున్న ఎన్నికల జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమంపై రాష్ట్ర ఎన్నికల అధికారులకు కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ.. ఎన్నికల జాబితాల ఖచ్చితత్వం ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి అత్యంత కీలకమని , జిల్లాలో అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఓటరు జాబితాల సవరణ ప్రక్రియను ఎటువంటి లోపాలు లేకుండా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు.. ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వేలను కచ్చితత్వంతో నిర్వహించేందుకు బీూలు, సూపర్వైజర్లు, ఎన్నికల సిబ్బందికి ఇప్పటికే శిక్షణ కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, మరణించిన లేదా వలస వెళ్లిన ఓటర్ల పేర్ల తొలగింపు, డూప్లికేట్ నమోదుల పరిశీలన వంటి అంశాలను అత్యంత జాగ్రత్తగా పరిశీలిస్తామని తెలిపారు. ఇంటింటి సర్వే ప్రక్రియను కచ్చితత్వంతో నిర్వహించి, కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, మరణించిన మరియు వలస వెళ్లిన ఓటర్ల వివరాల నవీకరణను సమయపాలనతో పూర్తి చేస్తామని, ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలు, ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ప్రజలకు ఎన్నికల నమోదు ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా మీడియా ద్వారా ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు, ఎన్నికల సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, అభ్యంతరాలను వేగంగా పరిష్కరించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సర్ పై వచ్చే ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి సమయపాలనతో పరిష్కరించేలా చర్యలు ఉంటాయని, జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని స్థాయిలో అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ అమరేందర్, ఆర్డీవోలు సురేష్ బాబు, బన్సీలాల్ , యాదగిరి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రవి కుమార్, అన్ని మండలాల తహశీల్దార్లు , ERO\T, AERO\T, బీూలు సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోల్లో వేగం పెంచాలి

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



**భూపాలపల్లి ప్రతినిధి, మే 29(నినాదం):** అకాల వర్షాల దృష్ట్యా ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. శుక్రవారం ఐడిఓసీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్ల పై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి సిరిశెట్టి సంకీర్త్ తో కలిసి పౌర సరఫరాలు, రవాణా, వ్యవసాయ, సహకార, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో పాటు మిల్లర్లు, ట్రాన్స్ పోర్టు కాంట్రాక్టర్లు, పిఏసిఎస్ సీఈఓ లు, ఏపిఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ మక్కల కొనుగోలులో రాష్ట్రంలో మన జిల్లా మొదటి స్థానంలో ఉన్నదని, అదే స్ఫూర్తితో ధాన్యం కొనుగోళ్లలో సైతం వేగం పెంచాలని సూచించారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా కట్టు దిట్టమైన చర్యలు చేపట్టాలని అన్నారం కొనుగోలు కేంద్రాలలో రైతులకు తప్పనిసరిగా ట్రక్ షీట్ ఇవ్వాలని, ధాన్యం కాంటా జరిపిన వెంటనే ట్యాబ్ ఎంట్రి కచ్చితంగా చేయాలని తెలిపారు. ఐరిస్ పద్ధతిని తొలగించి ఓటిపి ద్వారా ధాన్యం కొనుగోలు చేపట్టాలని రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని మరో వారంలోగా కొనుగోలు పూర్తి చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు జరిగిన వెంటనే రైతులకు ట్రక్ షీట్ ఇవ్వాలని ఆదేశించారు. ట్రక్ షీట్ ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాలలో ఖచ్చితమైన లక్ష్యం ద్వారా ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పౌరసరఫరాలు, సంస్థ రవాణా, డి ఆర్ డి ఓ, సహకార శాఖల అధికారులు, మిల్లర్లు పిఏసిఎస్ సీఈవోలు, ఏపీఎం లు తదితరులు పాల్గొన్నారు

# కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**బీజేపీ ప్రశిక్షణా కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్..**




**నిజామాబాద్ ప్రతినిధి, మే 29 (నినాదం) :** కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని బోర్గాం లో కొనసాగుతున్న బీజేపీ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ తరగతులు శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్ పాల్ మాట్లాడుతూ ఎన్నికలు లేనప్పుడు కూడా సమాజంలో పార్టీ పని నిరంతరం జరిగే విధంగా చూడాలన్నారు. అన్ని అనుబంధ సంస్థలతో సమన్వయం ఏర్పరుచుకోవాలన్నారు. సంస్థలు వేర్వేరు రంగాల్లో పని చేసిన లక్ష్యం మాత్రం ఒకటేనని చెప్పారు. ప్రపంచంలో భారత్ స్థానం గౌరవం పెరిగిందని, మోడీ నేతృత్వంలో అనేక పథకాలు గ్రామస్థాయి వరకు కూడా చేరుతున్నాయన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి, కర్ణాటకలోని బెల్గావి ఎమ్మెల్యే అభయ్ పాటిల్ జిల్లా ప్రశిక్షణా తరగతుల ముగింపు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి,జాతీయ పసుపు చైర్మన్ పల్లె గంగా రెడ్డి పాల్గొన్నారు.

# ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలి

**గద్వాల బ్యూరో మే 29(నినాదం) :** ఓటరు జాబితాను ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా, పారదర్శకంగా రూపొందించేందుకు ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై శుక్రవారం హైదరాబాదు నుంచి అదనపు ముఖ్య ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వర్ రెడ్డి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తిచేసి అక్టోబర్ 1న ఫైనల్ ఎలక్ట్రోరల్ ఓటర్లు జాబితాను ముద్రించి, ప్రకటించాల్సి ఉందన్నారు. ఎన్యుమరేషన్ ఫామ్ లను ఓటర్లకు ఇచ్చిన తర్వాత ప్రతి ఇంటినీ సంబంధిత బిఎల్ఓలు మూడుసార్లు సందర్శించి, వారిచ్చే డిక్లరేషన్ కూడా తీసుకోవాల్సి ఉంటుందన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి బూత్ లెవెల్ ఏజెంట్ల నియా మకం చేపట్టాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ సరిగ్గా పనిచేయని బిఎల్వోల స్థానంలో కొత్త వారి నియామకం చేపట్టాలన్నారు. సంబంధి త మండలాల తహసీల్దారులు తమ పరిధి లోని సూపర్వైజర్లు, బిఎల్ఓ లతో సమావేశాలు నిర్వహించి ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. ఇప్పటివరకు జోగులాంబ గద్వాల జిల్లాలో 78.52 శాతం మ్యాపింగ్ పూర్తయిందని, గద్వాల మండలం లో చాలా తక్కువ మ్యాపింగ్ జరిగినందున వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీవో శ్రీనివాస రావు, వివిధ మండలాల తహసిల్దా ఓరులు, అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.




# ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి

**ఎస్.ఐ.ఆర్. కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలి**

**డ్రాఫ్ట్ ఓటరు జాబితా సిద్ధం చేసే ముందు ప్రతి అభ్యంతరాలు, క్లెయిమ్‌లపై క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించాలి**

**రాజకీయ పార్టీలతో నిరంతరం సమన్వయం కొనసాగించాలి**

**ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంపై జిల్లా అధికారులతో సమీక్షించిన కలెక్టర్ దివాకర్**



**ఖమ్మం, మే29(నినాదం):** ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ద్వారా ప్రతి ఓటరు వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలిస్తూ, మ్యాపింగ్ ప్రక్రియ మరింత వేగవంతంగా చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అంశంపై జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ పి.శ్రీజ, మున్సిపల్ కార్పోరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి ఇప్పటివరకు చేపట్టిన మ్యాపింగ్ వివరాలను మండలాల వారీగా పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని, ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియలో బీఎల్ఓల పని తీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, లక్ష్యాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఖచ్చితమైన ధృవీకరణ, సరైన డేటా నమోదు, పారదర్శకత తో పని చేయాలన్నారు. ఎస్ఐఆర్ లో భాగమైన మండలాలు, కార్పోరేషన్, మున్సిపాలిటీ సంబంధించి ప్రతి ఓటర్లను మ్యాపింగ్ చేసే విధంగా టార్గెట్ పెట్టుకొని వంద శాతానికి చేరుకోవాలన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ ప్రక్రియను జూన్ 24 నుంచి జులై 25 వరకు చేపట్టనున్నా రన్నారు. ఫారం-6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించాలని, మరణించిన ఓటర్ల వివరాలను ధృవీకరించి, తొలగింపు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. బదిలీ ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాలను సక్రమంగా పరిశీలించి, రికార్డులను నవీకరించాలని తెలిపారు. ఓటర్లు అందరూ ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమంలో పాల్గొని సరైన వివరాలు అందించేలా తద్వారా ఖచ్చితమైన ఓటరు జాబితా తయారీలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోరారు. బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అలాగే ఓటర్లు కూడా ఎలక్షన్ కమిషన్ ఆన్‌లైన్ సేవల ద్వారా తమ వివరాలను నమోదు చేసుకునే అవకాశం ఉందని వివరించారు. అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో చేర్చి, అనర్హులైన ఓటర్ల వివరాలను తొలగించే ప్రక్రియను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఎస్ఐఆర్ కార్యక్రమం ద్వారా శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాల తొలగింపు, డబుల్ ఎంట్రీలతొలగింపు జరుగుతుందని తెలిపారు. జూన్ 25 నుండి జూలై 24 వరకు బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను పూర్తి స్థాయిలో ధృవీకరించాలని ఆదేశించారు. ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి అర్హమైన ఓటరుని గుర్తించి జాబితాలో చేర్చాలని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా సిద్ధం చేసే ముందు ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఒక కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండేలా చూడాలని, 1200 మంది ఓటర్ల సంఖ్య దాటితే కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి బీఎల్వో వద్ద ఎన్యుమరేటర్ ఫారాలు తగినంతగా అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ప్రతి బీఎల్వోకు ఎస్ఐఆర్ నిబంధనలు, విధి విధానాలు, ఫీల్డ్ వెరిఫికేషన్ విధానం, ఫారాల నిర్వహణపై పూర్తి అవగాహన, పట్టు ఉండేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శిక్షణ కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలు, కొత్త క్లెయిమ్‌లు, దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి మాత్రమే నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తుపై ఫీల్డ్ స్థాయిలో విచారణ నిర్వహించాలని, ఎటువంటి ఫిర్యాదును నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ జరుగుతుందని, సెప్టెంబర్ 28 వరకు వాటి పరిష్కార ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. తుది ఓటరు జాబితాను అక్టోబర్ 1న ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. అంతకుముందు శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఎస్ఐఆర్ -2026 ప్రక్రియ నిర్వహణ, శిక్షణ, ఇతర అంశాలపై జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులకు ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి, దిశానిర్దేశం చేశారు. జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల నమోదు అధికారులు, సహాయక ఎన్నికల నమోదు అధికారులు, బిఎల్ఓలు, సూపర్‌వైజర్‌లతో సహా ఎన్నికల అధికారులకు శిక్షణా కార్యక్రమం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఖమ్మం కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్డీసీ రాజేశ్వరీ, ఎలక్షన్ సూపరింటెండెంట్ రాజు, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ జయచందర్, అన్సరీ, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేస్తాం

**రైతులు ఎవరు ఆధర్య పడొద్దు**

**బిజెపి బిఆర్ఎస్ పార్టీ నేతలకు రైతులపై మాట్లాడే నైతిక హక్కు లేదు**

**కాంగ్రెస్ ప్రభుత్వంలో వ్యవసాయం పండుగలా మారింది**

**ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు**



**మంథని మే 29( నినాదం) :** తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం ఆయన మంథని వ్యవసాయ మార్కెట్ ను సందర్శించారు. యాసంగి పంట రావడం వల్ల ఆలస్యం అవుతుందని రైతులు ఆందోళన చెందవద్దని, ఆధైర్యపడవద్దని అన్నారు. మంథని వ్యవసాయ మార్కెట్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులతో ముచ్చటించారు. రైతులకు ధాన్యం కొనుగోలు చేసే వరకు సకల సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. బిజెపి, బీఆర్ఎస్ పార్టీ నేతలకు రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు.కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర పెంచడమే కాకుండా కొనుగోలు విషయం పైన ఎందుకు ఆలోచన చేయడం లేదని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వాలు రైతులను విస్మరించాయని, కాంగ్రెస్ ప్రభుత్వంలోని వ్యవసాయం అంటే పండుగలా మారిందని వివరించారు. ప్రభుత్వ గోదాములు సరిపడకపోతే ప్రైవేట్ గోదాములను సైతం ఉపయోగించుకొని వరి ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. తడిసిన ధాన్యం సైతం కొనుగోలు చేసి మద్దతు ధర అందజేస్తామని రైతులందరూ అండగా ఉండాలని పేర్కొన్నారు. వర్షాలు చెప్పి రావని, వాతావరణ మార్పు వల్ల వర్షాలు సంభవిస్తున్నాయని, రైతాంగం ఇబ్బంది పడడం పట్ల బాధగా ఉందని మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడారు. రైతాంగం పడుతున్న బాధను ప్రతిపక్షాలు రాజకీయం చేయడం తగదని తెలిపారు. ప్రతిపక్షాలకు వర్షాలు చెప్పి వస్తాయా అని ఎద్దేవా చేశారు. చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. సాధ్యమైనంత త్వరగా కొనుగోలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదల వెంకన్న, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, ఆర్డీవో సురేష్, ఏడిఏ అంజనీ మిశ్రా, ఏఓ నవ్య మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు, మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, మండల పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్, ఆర్టిఏ మెంబర్ సురేష్, నాయకులు తొట్ల తిరుపతి, గోటికార్ కిషన్ జి, మంథని సత్యం, ఎరుకల ప్రవీణ్, కొటారి బాపు, నాయినేని జగన్ మోహన్ రావు, కర్ణ కృష్ణ, మాజీ సర్పంచ్ దొరగొర్ల శ్రీనివాస్, సోషల్ మీడియా ఇన్చార్జి ఆరెల్లి కిరణ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

**గద్వాల బ్యూరో మే 29( నినాదం) :** జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి, అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించే వేడుకలను పకడ్బందీగా నిర్వహిం చాలన్నారు .ముఖ్య అతిథిలు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆహ్వానితులందరికీ ఆహ్వానాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజాప్రతినిధులు,



అధికారులు, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు పకడ్బందీగా కల్పించాలన్నారు. పతాకావిష్కరణ కార్యక్రమంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ముందస్తుగా మాక్ డ్రిల్ నిర్వహించడంతో పాటు పోలీసు గౌరవ వందనం ఏర్పాటు చేయాలని, బందోబస్తు కల్పించాలని పోలీసు అధికారులకు సూచించారు. వేడుకల ప్రాంగణంలో తాగునీరు, పారిశుద్ధ్య ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేడుకల్లో ప్రతిబింబించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా వివిధ శాఖల స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రదర్శన స్టాళ్లను ఆకర్షణీయంగా,వినూత్నంగా ఏర్పాటు చేసిన ఉత్తమ శాఖలకు అవార్డులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల అమలులో విశేష కృషి చేసి ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులు, అధికారులను రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మండలాలు, గ్రామ స్థాయిలో కూడా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలంకరణతో సుందరంగా అలంకరించి పండుగ వాతావరణాన్ని ప్రతిబింబించేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాకేంద్రంలోని స్మృతి వనం, పాత బస్టాండ్ వద్ద గల తెలంగాణ పోరాట యోధుల విగ్రహాల వద్ద, సభాస్థలి వేదికలను పూలతో అందంగా అలంకరించాలన్నారు. వేడుకల ఏర్పాట్లలో ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా విజయవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు నర్సింగ రావు, మధు మోహన్, ఆర్డీఓ శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏఓ భూపాల్ రెడ్డి, తహసిల్దార్ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ జానకి రామ్ సాగర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# త్రివేణి సంఘమ స్నానం.. త్రినేత్రుడి దర్శనం...



### తొమ్మిదో రోజుకు చేరుకున్న అంత్య పుష్కరాలు
### క్రమంగా పెరుగుతున్న భక్తుల తాకిడి
### నిండుగా దర్శనమిస్తున్న సరస్వతి ఘాట్
### భక్తి పరవశంతో తరిస్తున్న ప్రజలు







**భూపాలపల్లి ప్రతినిధి, మే 29 (నినాదం):** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సరస్వతి అంత్య పుష్కరాలు విజయవంతంగా 9వ రోజుకు చేరుకున్నాయి. అంతే పుష్కరాల ముగింపుకు మరో మూడు రోజుల గడువు మాత్రమే మిగిలిపోవడంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్గఢ్ రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుండి భక్తులు తరలివస్తున్నారు. త్రివేణి సంగమంలో పుష్కర స్నానాలు ఆచరించి సరస్వతి మాతకు చీరేసారే సమర్పిస్తున్నారు. నదీ తీరంలో సైతకలింగాలను నెలకొల్పి ప్రత్యేక పూజలు జరిపారు. పుష్కర స్నానం ఆచరించిన అనంతరం త్రినేత్రుని దర్శించుకుని మనసారా వేడుకున్నారు. సరస్వతి అంత్య పుష్కరాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవి విరమణ చేసి ప్రస్తుతం డా ఎం సి హెచ్ ఆర్డీ వైస్ చైర్మన్, డిజి శాంతి కుమారి, విశాఖపట్నం శారదా పీఠం పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహా స్వామి, వరంగల్ జిల్లా ఇల్లంద గ్రామం ఇంద్రాణి కాళీ కాలభైరవ శక్తి పీఠం రామకృష్ణ అఘోరి కాలభైరవ ఉపాసకులు శుక్రవారం సరస్వతి ఘాట్‌లో పుష్కర





స్నానం ఆచరించారు.

**నిండుగా దర్శనమిచ్చిన సరస్వతి ఘాట్..**

అంత్య పుష్కరాల ముగింపుకు మరో మూడు రోజులు మాత్రమే మిగిలి ఉండడంతో భక్తుల తాకిడి పెరిగింది. తెల్లవారుజాము నుండి భక్తులు సరస్వతి పుష్కర ఘాట్‌లో పుష్కర పుణ్య స్నానం ఆచరించడం ప్రారంభించారు. సాయంత్రానికి భక్తుల రద్దీ మరింత ఎక్కువ అయింది. దీంతో సరస్వతి పుష్కర ఘాట్ భక్తులతో నిండుగా దర్శనమిచ్చింది. వారాంతపు సెలవు దినాలు వస్తుండడంతో భక్తుల రద్దీ మరింత ఎక్కువ అయ్యే అవకాశం ఉంది. భక్తుల తాకిడిని దృష్టిలో పెట్టుకొని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాల మేరకు అధికారులు ఏర్పాట్లు కొనసాగిస్తున్నారు.







**భక్తి పరవశంతో తరిస్తున్న ప్రజలు..**

సరస్వతి అంత్య పుష్కరాల్లో భాగంగా పుష్కర స్నానానికి వస్తున్న భక్తులు త్రివేణి సంగమంలో స్నానం ఆచరించి భక్తి పరవశంలో మునిగితేలుతున్నారు. పుష్కర స్థానం అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తుల శివనామ స్మరణతో ఆలయం మారు మ్రోగిపోతుంది.

# ఉదయాన్నే ఈ బ్లూ టీ తాగితే చాలు..

## పొట్ట చుట్టూ ఉన్న మొండి కొవ్వును కరిగించే సూపర్ డ్రింక్ ఇదే!

**వైద్య నిపుణుల పోషకాహార నిపుణుల నివేదికల ప్రకారం.. శంఖుపుష్పాలలో 'ఆంథోసైనిన్' అనే పవర్‌ఫుల్ యాంటీఆక్సిడెంట్ ఉంటుంది. అంతేకాకుండా, డయాబెటిస్ బాధితుల్లో బ్లడ్ షుగర్ లెవెల్స్‌ను అదుపులో ఉంచడానికి ఇది రామబాణంలా పనిచేస్తుందని వైద్య అధ్యయనాలు చెబుతున్నాయి. మరి ఈ మ్యాజికల్ బ్లూ టీ వల్ల కలిగే లాభాలు దీన్ని తయారు చేసే విధానం ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. ఇది ఈ టీకి సహజసిద్ధమైన నీలి రంగును ఇవ్వడమే కాకుండా శరీరానికి రక్షణ కవచంలా నిలుస్తుంది.**



**బ్లూ టీ తాగడం వల్ల కలిగే 5 ప్రధాన ఆరోగ్య ప్రయోజనాలు:**

**1. వేగంగా బరువు తగ్గడం :**
శంఖుపుష్పం టీ శరీరంలో పేరుకుపోయిన అనవసరపు కొవ్వును కరిగించడంలో చురుగ్గా పనిచేస్తుంది. ఇది ఫ్యాటీ లివర్ సమస్యను నివారించడమే కాకుండా, శరీరంలో కేలరీలను వేగంగా బర్న్ చేసేలా మెటబాలిజం రేటును పెంచుతుంది. ఊబకాయం లేదా బెల్లీ ఫ్యాట్ (పొట్ట చుట్టూ కొవ్వు) తో బాధపడేవారికి ఇది పర్ఫెక్ట్ వెయిట్ లాస్ డ్రింక్.

**2. డయాబెటిస్ నియంత్రణ**
మధుమేహం ఉన్నవారికి ఈ బ్లూ టీ ఒక అద్భుతమైన గృహవైద్యం. భోజనానికి ముందు లేదా భోజనం తర్వాత ఒక కప్పు శంఖుపుష్పం టీ తాగడం వల్ల శరీరంలో గ్లూకోజ్ శోషణ నెమ్మదిస్తుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరిగిపోకుండా అడ్డుకుంటుంది ఇన్సులిన్ స్రావాన్ని క్రమబద్ధీకరిస్తుంది.

**3. బాడీ డిటాక్సిఫికేషన్**
ఈ టీలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటం వల్ల శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతుంది. శరీరంలో పేరుకుపోయిన టాక్సిన్స్ (విషపూరిత వ్యర్థాలు) ను బయటకు పంపి రక్తాన్ని శుద్ధి చేస్తుంది. దీనివల్ల కాలేయం , మూత్రపిండాల ఆరోగ్యం మెరుగవుతుంది.

**4. చర్మం, జుట్టు సౌందర్యం:**
శంఖుపుష్పాలలో ఉండే యాంటీ-ఏజింగ్ గుణాలు చర్మంపై ముడతలను తగ్గించి, గ్లో పెరిగేలా చేస్తాయి. అలాగే, ఇది తలలో రక్తప్రసరణను మెరుగుపరచడం ద్వారా జుట్టు కుదుళ్లను బలోపేతం చేసి, జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది.

**5. ఒత్తిడి, ఆందోళనల నుండి ఉపశమనం**
ఈ బ్లూ టీ ఒక సహజమైన అడాప్టోజెన్‌గా పనిచేస్తుంది. అంటే ఇది మెదడును ప్రశాంతపరిచి మానసిక ఒత్తిడి, ఆందోళన డిప్రెషన్‌ను తగ్గించడంలో సహాయపడు తుంది. రాత్రి నిద్రలేమి సమస్య ఉన్నవారు ఈ టీ తాగితే మంచి నిద్ర పడుతుంది.



**మ్యాజికల్ బ్లూ టీ తయారీ విధానం**

**కావలసిన పదార్థాలు:**
ఎండబెట్టిన లేదా తాజా శంఖుపుష్పాలు (4 నుండి 5), ఒక కప్పు నీళ్లు, ఒక స్పూన్ తేనె (ఆప్షనల్), కొన్ని నిమ్మరసం చుక్కలు.

**తయారీ:**
మొదట ఒక గిన్నెలో ఒక కప్పు నీటిని పోసి బాగా మరిగించాలి. నీరు మరుగుతున్నప్పుడు అందులో శంఖుపుష్పాలను వేసి స్టవ్ ఆఫ్ చేయాలి. గిన్నెపై మూత పెట్టి 3-5 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. అప్పుడు పూలలోని నీలి రంగు , పోషకాలు నీటిలోకి చేరుతాయి.ఆ తర్వాత ఈ నీటిని వడకట్టి.. అందులో కొద్దిగా తేనె కలుపుకుని తాగవచ్చు.

**ఒక మ్యాజిక్ ట్రిక్:**
ఈ నీలి రంగు టీలో రెండు చుక్కల నిమ్మరసం పిండగానే.. ఆశ్చర్యకరంగా ఈ టీ రంగు నీలం నుండి పర్పుల్ నేరేడు రంగులోకి మారుతుంది. ఇది టేస్ట్‌ను పెంచడమే కాకుండా యాంటీఆక్సిడెంట్లను ఇస్తుంది.

# మహిళా సాధికారతకు వేదికగా జిటో 'ఉడాన్' ఎగ్జిబిషన్ ప్రారంభం

## రెండు రోజుల పాటు కొనసాగనున్న ప్రదర్శనలో 110కు పైగా స్టాల్స్



**హైదరాబాద్ బ్యూరో, మే 29 (నినాదం):** మహిళా సాధికారతతో పాటు చిన్న తరహా పరిశ్రమలు,యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందించే లక్ష్యంతో జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జిటో) ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక 'ఉడాన్' ఎగ్జిబిషన్ ఘనంగా ప్రారంభమైంది. రెండు రోజుల పాటు కొనసాగనున్న ఈ ప్రదర్శనకు నగర ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ కార్యక్రమానికి ప్రముఖ ఫిట్‌నెస్ ఐకాన్ కిరణ్ డెంబ్లా ముఖ్య అతిథిగా హాజరై ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. మహిళలు వ్యాపార రంగంలో మరింత ముందుకు రావాలని, తమ ప్రతిభను ప్రపంచానికి చాటాలని ఆమె ఆకాంక్షించారు. ఈ ఏడాది ఉడాన్ ఎగ్జిబిషన్‌ను జిటో అధ్యక్షురాలు సుధా కీమ్తీ నేతృత్వంలో, కార్యదర్శి టీనా షా, ఖజాంచీ అనితా రాంకా మరియు ఉడాన్ బృందం సమిష్టిగా నిర్వహిస్తున్నారు. మహిళా పారిశ్రామిక వేత్తలకు తమ ఉత్పత్తులు, సేవలను ప్రదర్శించేందుకు ఈ వేదిక ఎంతో ఉపయోగపడుతోందని నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం ఎగ్జిబిషన్‌లో 110కు పైగా స్టాల్స్ ఏర్పాటు కావడం జిటోపై ఉన్న విశ్వాసం, ఆదరణకు నిదర్శనంగా నిలుస్తోంది. ఫ్యాషన్, జ్యువెలరీ, హ్యాండ్‌క్రాఫ్ట్స్, హోమ్ డెకర్, లైఫ్‌స్టైల్ ఉత్పత్తులు, ఫుడ్ మరియు వివిధ రంగాలకు చెందిన మహిళా ఆధ్వర్యంలోని వ్యాపార సంస్థలు ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నాయి.





వ్యాపార ప్రోత్సాహంతో పాటు ప్రతిభ కలిగిన మహిళా పారిశ్రామికవేత్తలను గుర్తించి, వారికి సరైన వేదిక కల్పించడం ఈ ఎగ్జిబిషన్ ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలోని ప్రతి ప్రాంతానికి చేరువ కావాలనే లక్ష్యంతో మహిళల ఆధ్వర్యంలోని వ్యాపారాలకు నెట్‌వర్కింగ్, అభివృద్ధి మరియు కొత్త వ్యాపార అవకాశాలు కల్పించే దిశగా ఉడాన్ బృందం కృషి చేస్తోందన్నారు. మహిళా ప్రతిభ, వ్యాపార నైపుణ్యం, సాధికారతకు ప్రతీకగా 'ఉడాన్' ఎగ్జిబిషన్ నిలుస్తుందని జిటో ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుధా జైన్ తో పాటు జీటో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రూ.500 నోటే బాద్‌షా.. 20% పెరిగిన నకిలీలు

**ముంబయి:** రెండు వేల రూపాయల నోట్ల ఉపసంహరణ తర్వాత రూ.500 నోటుకు ఆదరణ పెరిగింది. 2025-26లో బ్యాంకింగ్ వ్యవస్థలో చలామణిలో ఉన్న వీటి సంఖ్య 11.2 శాతం వృద్ధి చెందింది. అదే సమయంలో నకిలీ నోట్ల బెడదా పెద్ద ఎత్తున రూ.500 నోటు ఎదుర్కొంటున్నట్లు ఆర్‌బీఐ తన వార్షిక నివేదికలో తెలిపింది. 2026 మార్చి నాటికి 7,05,482 లక్షల రూ.500 నోట్లు చలామణిలో ఉండగా.. అంతకుముందు ఏడాది ఇదే సమయానికి 6,34,458 లక్షల నోట్లు సర్క్యులేషన్‌లో ఉన్నాయి. విలువ పరంగా చూస్తే రూ.31.72 లక్షల కోట్ల నుంచి రూ.35.27 లక్షల కోట్లకు పెరిగినట్లు ఆర్‌బీఐ తెలిపింది.

మార్కెట్‌లో చలామణిలో ఉన్న మొత్తం కరెన్సీలో ఎక్కువ వాటా కూడా 500 రూపాయల నోటుదే. సంఖ్యా పరంగా 41.2 శాతం వాటా కలిగి ఉండగా.. విలువ పరంగా 86 శాతం వాటా వాటిదే కావడం గమనార్హం. సంఖ్యాపరంగా రూ.10 నోటు 16.1 శాతం వాటాతో రెండో స్థానంలో ఉంది. బ్యాంకింగ్ వ్యవస్థలో చలామణిలో ఉన్న మొత్తం నోట్ల విలువ 11.9 శాతం, సంఖ్య 10.5 శాతం పెరిగినట్లు ఆర్‌బీఐ తెలిపింది. దీనిబట్టి ఆర్థిక వ్యవస్థలో నగదు డిమాండ్ ఇంకా కొనసాగుతోందనడానికి ఇది సూచికగా నిలుస్తోంది.



**నకిలీ మకిలీ**
బ్యాంకింగ్ వ్యవస్థలో నకిలీ రూ.500 నోట్లు కూడా పెద్ద సంఖ్యలో చలామణిలో ఉన్నట్లు ఆర్‌బీఐ గుర్తించింది. గతేడాదితో పోలిస్తే ఈ నకిలీల బెడద 20 శాతం పెరిగినట్లు తెలిపింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 1,17,722 రూ.500 నోట్లను గుర్తించగా.. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆ సంఖ్య 1,41,907 నోట్లకు పెరిగినట్లు ఆర్‌బీఐ తెలిపింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 30,591 నకిలీ రూ.200 నోట్లను గుర్తించినట్లు ఆర్‌బీఐ తెలిపింది. మొత్తంగా బ్యాంకింగ్ వ్యవస్థలో నకిలీ నోట్ల బెడద 5.7 శాతం మేర పెరిగినట్లు పేర్కొంది.

2023 మే నెలలో రూ.2వేల నోటును ఉపసంహరించుకున్న తర్వాత 2026 మార్చి 31 నాటికి 98.45 శాతం నోట్లు వెనక్కి వచ్చినట్లు ఆర్‌బీఐ తన వార్షిక నివేదికలో పేర్కొంది.

# సంక్షేమ పథకాలకు డిజిటల్ కరెన్సీ

## వార్షిక నివేదికలో ఆర్‌బీఐ

**ముంబయి:** సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (జదీణజ) పైలట్ ప్రాజెక్ట్‌ను మరింత విస్తరించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యోచిస్తోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రిటైల్ రంగానికీ విస్తరించాలని భావిస్తోంది. ఫైనాన్షియల్ అసెట్ టోకనైజేషన్‌కు ఉన్న అవకాశాలనూ పరిశీలించాలని ఆర్‌బీఐ యోచిస్తోంది. తద్వారా సీబీడీసీ పైలట్ ప్రాజెక్ట్‌లో మరింత మందిని భాగస్వాములను చేయాలనుకుంటోంది. ఈ మేరకు ఆర్‌బీఐ తన వార్షిక నివేదికలో ఈ అంశాన్ని పొందుపరిచింది.



2025-26 ఆర్థిక సంవత్సరంలో గుజరాత్, పుదుచ్చేరి, చండీగఢ్ లలో నగదు బదిలీ పథకాల కింద డిజిటల్ కరెన్సీని ప్రయోగాత్మకంగా పరిశీలించినట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. ప్రజా పంపిణీ వ్యవస్థ లబ్ధిదారులకూ ఆహార సబ్సిడీని సీబీడీసీ ద్వారా అందించారు. లబ్ధిదారులు ఆ నిధులను రేషన్ షాపులు, ఎంపిక చేసిన వ్యాపారుల వద్ద వస్తువుల కొనుగోలుకు మాత్రమే ఉపయోగించేలా చూశారు. దీన్ని మరింత విస్తరించాలని భావిస్తోంది.సవాళున్నా వృద్ధికి ఢోకా లేదుపశ్చిమాసియా రూపంలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, పెరిగిన ఇంధన ధరలు, సప్లయ్ చైన్ అవరోధాలు ఉన్నా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశ వృద్ధికి ఢోకా లేదని ఆర్‌బీఐ పేర్కొంది. పటిష్ట మైన స్థూల ఆర్థిక పునాదులు బలంగా ఉండడమే దీనికి కారణమని తన వార్షిక నివేదికలో తెలిపింది. కార్పొరేట్, బ్యాంకింగ్ రంగాల బలోపేతమైన బ్యాలెన్స్ షీట్లు, ప్రభుత్వ మూలధన వ్యయం కారణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి సానుకూలంగా ఉండనుందని తెలిపింది. వివిధ వాణిజ్య భాగస్వాములతో కుదుర్చుకున్న ఒప్పందాలు కూడా వృద్ధికి దన్నుగా నిలవనున్నాయని అభిప్రాయపడింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో భారత్ 7.6 శాతం వృద్ధి రేటును నమోదు చేసి, ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని ఆర్‌బీఐ గుర్తు చేసింది. 2026-27లో వ్యవసాయ రంగం నైరుతి రుతుపవనాలపై ఆధారపడి ఉంటుందని అంచనా వేసింది. ఎల్‌నినో కారణంగా పంటల దిగుబడిపై ప్రభావం ఉన్నా.. రుతు పవనాల ప్రయాణంలో హిందూ మహాసముద్రంలో ఏర్పడే డైపోల్ ద్వారా ప్రతికూల ప్రభావాన్ని అధిగమించొచ్చని పేర్కొంది.




# సైనిక కుటుంబాలకు ఆకాష్ ప్రత్యేక స్కాలర్‌షిప్‌లు

**హైదరాబాద్,బ్యూరో, మే 29,( నినాదం):** దేశవ్యాప్తంగా సైనిక సిబ్బంది, వారి కుటుంబాలకు విద్యా మద్దతు అందించేందుకు ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ భారత సైన్యం, బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, ఐటీబీపీ వంటి రక్షణ, పారామిలిటరీ దళాలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ ఒప్పందాల ద్వారా ప్రస్తుతం సేవలందిస్తున్న సైనికులు, మాజీ సైనికులు, శౌర్య పుర స్కార గ్రహీతలు, దివ్యాంగులు ,అమరవీరుల కుటుంబాలకు స్కాలర్‌షిప్‌లు, కెరీర్ గైడెన్స్, అకడమిక్ మెంటరింగ్, దేశవ్యాప్త కోచింగ్ సదుపాయాలు అందించను న్నారు. అమరవీరుల పిల్లలకు పూర్తి ఫీజు మినహాయింపు, శౌర్య పురస్కార గ్రహీతల కుటుంబాలకు ప్రత్యేక రాయితీలు, సేవలందిస్తున్న మరియు పదవీ విరమణ చేసిన సిబ్బంది పిల్లలకు ట్యూషన్ ఫీజుపై రాయితీలు వర్తిస్తాయని సంస్థ తెలిపింది. ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ ఎండీ, సీఈఓ చంద్రశేఖర్ గరిస రెడ్డి మాట్లాడుతూ, రక్షణ కుటుంబాలకు నాణ్యమైన విద్య అందించేందుకు ఈ భాగస్వామ్యాలు ఉపయోగపడ తాయని అన్నారు.



# ఓపెన్‌ఏఐని వెనక్కి నెట్టి.. ట్రిలియన్ డాలర్లకు చేరువలో ఆంథ్రోపిక్..!

కృత్రిమమేధ సంస్థలు ఇప్పుడు ఇన్వెస్టర్లకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. తాజాగా ఏఐ స్టార్టప్ ఆంథ్రోపిక్ మార్కెట్ విలువ ట్రిలియన్ డాలర్లకు చేరువైంది. తాజాగా 65 బిలియన్ డాలర్ల నిధుల సమీకరణ సమయంలో కంపెనీ విలువను ఇన్వెస్టర్లు 965 బిలియన్ డాలర్లుగా లెక్కగట్టారు. ఈ ఫండింగ్ విషయాన్ని గురువారం ప్రకటించారు. ఆల్టిమీటర్ క్యాపిటల్, డ్రాగోనీర్, గ్రీనోక్స్, సెక్వోయా క్యాపిటల్ వంటి సంస్థలు నిధులిచ్చిన జాబితాలో ఉన్నాయి. ఈ సంస్థలు ఒక్కోటి రెండు బిలియన్ డాలర్ల చొప్పున ఆంథ్రోపిక్‌లో పెట్టుబడులు పెట్టినట్లు తెలుస్తోంది. సెక్వోయా మాత్రం దీనిపై స్పందించేందుకు ఇష్టపడలేదు.




ఈ విడతలో కూడా గూగుల్ సంస్థ నుంచి భారీగానే పెట్టుబడులు అందాయి. ఇప్పటికే ఆంథ్రోపిక్‌లో 40 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెడతానని ఈ టెక్ దిగ్గజం ప్రకటించింది. అమెజాన్ 5 బిలియన్ డాలర్ల నిధులను సమకూర్చినట్లు తెలుస్తోంది. శాంసంగ్ ఎలక్ట్రానిక్స్, మైక్రాన్ టెక్నాలజీ, ఎస్కే హైనిక్స్‌లు కూడా ఇన్వెస్టర్ల జాబితాలో ఉన్నాయి. కృత్రిమ మేధకు సంబంధించిన రంగాల్లోని సంస్థల మార్కెట్ విలువ భారీగా పెరుగుతోంది. ఇటీవలే చిప్‌ల తయారీ కంపెనీలు శాంసంగ్ ఎలక్ట్రానిక్స్, మైక్రాన్ టెక్నాలజీ, ఎస్కే హైనిక్స్‌లు ట్రిలియన్ డాలర్ల మార్కెట్ విలువను తాకాయి.

**కొన్ని వారాల్లో మిథోస్ శ్రేణి ఏఐ అందుబాటులోకి..**
ఇదిలా ఉండగా.. క్లాడ్ ఓపస్ 4.8 మోడల్‌ను ఆంథ్రోపిక్ తాజాగా అందుబాటులోకి తెచ్చింది. ఇక మిథోస్ శ్రేణి ఏఐని వినియోగదారులకు కొన్ని వారాల్లో అందుబాలోకి తెస్తామని ఈ కంపెనీ ప్రకటించింది. అయితే దీనికి సంబంధించిన కచ్చితమైన వివరాలను మాత్రం బహిర్గతం చేయలేదు. మిథోస్ తన అత్యాధునిక సైబర్ సెక్యూరిటీ సామర్థ్యాలతో పలు సాఫ్ట్‌వేర్‌లలో ఏళ్లతరబడి ఉన్న బగ్‌లను వేగంగా కనుగొని.. వాటిని వాడుకొనే మార్గాలను చెప్పింది. దీంతో అమెరికాలోని చాలా టెక్ దిగ్గజ సంస్థలు తమ సాఫ్ట్‌వేర్ల విషయంలో అప్రమత్తమయ్యాయి. అగ్రరాజ్య ప్రభుత్వం ఒత్తిడితో మిథోస్ విడుదలను ఆంథ్రోపిక్ వాయిదా వేసుకొంది. మరోవైపు, ప్రాజెక్ట్ గ్లాస్‌వింగ్ పేరిట మిథోస్‌ను వాడి టెక్ దిగ్గజాల్లో సాఫ్ట్‌వేర్‌లను సరిచేసే పని మొదలుపెట్టారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

### మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పత్య నాయక్



**ఆమనగల్లు, మే 29(నినాదం) :** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని మసీదు సమీపంలో ప్రధాన మంచినీటి పైప్‌లైన్ పగిలిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పత్య నాయక్, కౌన్సిలర్ వెంకటయ్యతో కలిసి వెంటనే స్పందించారు. మున్సిపల్ సిబ్బందితో కలిసి యుద్ధప్రతిపాదికన మరమ్మతులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యమని వారు తెలిపారు.

## దెబ్బతిన్న మామిడి తోటలను పరిశీలించిన హార్టికల్చర్ అధికారి

### బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

### మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి



**ఆమనగల్లు, మే 29(నినాదం):** మండల కేంద్రంలో రెండు రోజుల క్రితం కురిసిన అకాల వర్షం, బలమైన ఈదురుగాలుల కారణంగా నష్టపోయిన మామిడి తోటలను శుక్రవారం హార్టికల్చర్ విస్తరణాధికారి శ్రవణ్ సందర్శించారు. స్థానిక తోటల్లో గాలివాన ధాటికి నేలరాలిన మామిడి కాయలను, విరిగిపడిన చెట్ల కొమ్మలను నిశితంగా పరిశీలించారు. పంట నష్టం వివరాలను, నష్టపోయిన రైతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో జరిగిన పంట నష్టంపై సమగ్ర నివేదికను తయారు చేసి, తదుపరి చర్యల కోసం ప్రభుత్వానికి నివేదిస్తామని అధికారి శ్రవణ్ రైతులకు హామీ ఇచ్చారు. హార్టికల్చర్ అధికారి పర్యటనలో పాల్గొన్న మండల కేంద్ర మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి మాట్లాడుతూ చేతికొచ్చే దశలో ఉన్న మామిడి పంట ఈదురుగాలుల వల్ల నేలపాలవ్వడంతో రైతులు కోలుకోలేని విధంగా దెబ్బతిన్నారని పేర్కొన్నారు. ఎంతో పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంట కళ్లముందే నాశనమవ్వడంతో రైతాంగం తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, దెబ్బతిన్న తోటలను పూర్తిస్థాయిలో అంచనా వేయాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన ప్రతి మామిడి రైతుకు తక్షణమే తగిన నష్టపరిహారం అందించి, ప్రభుత్వం వారిని అన్ని విధాలా ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు బాలయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

### సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన మాజీ కార్పొరేటర్



**అల్వాల్, మే 29 (నినాదం) :** అల్వాల్ సర్కిల్ పరిధిలోని నూతన డివిజన్ గా ఏర్పడిన తుర్కపల్లి వెంకన్న కాలనీ మరియు సాయి సూర్య కాలనీలో 20 లక్షల మంజూరు అయిన వ్యయంతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. మైనంపల్లి హనుమంతరావు సహాయ సహకారాలతో పాత మచ్చ బొల్లారం డివిజన్ సమగ్ర అభివృద్ధి యే ముఖ్య లక్షమని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో కాలనీల ప్రెసిడెంట్లు సందీప్ రెడ్డి, సురేందర్ రెడ్డి సాన సురేందర్ భాస్కర్ రెడ్డి లక్ష్మీనారాయణ ఆగ మయ్య రెడ్డి స్థానిక నాయకులు లడ్డు రెడ్డి, దిండ్ల స్వామి, బొబ్బిలి సురేందర్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, రాజేందర్ యాదవ్, ఆనంద్, సంపత్ యాదవ్, బబ్లు, నవీన్, వెంకటేష్, రాజేందర్, పాల్గొన్నారు.

## మల్లన్న స్వామి, బీరప్ప దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం

### ఐనోలు సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి





**పటాన్చెరు, మే29(నినాదం):** ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని పెద్దకంజర్ల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీశ్రీశ్రీ మల్లికార్జున స్వామి దేవాలయం, శ్రీశ్రీశ్రీ బీరప్ప స్వామి దేవాలయాల నిర్మాణాలను సొంత నిధులతో అతి త్వరలో పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకొని రానున్నట్లు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం పెద్ద కంజర్ల గ్రామంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ పుర ప్రముఖులతో కలిసి ఆలయ నిర్మాణాలను పరిశీలించారు. గతంలో ఆలయ నిర్మాణాల కోసం 10 లక్షల రూపాయల విరాళాలు అందించినట్లు తెలిపారు. మరో మూడు నెలల్లో ఆలయ నిర్మాణాలు పూర్తి చేసేలా 40 లక్షల రూపాయల విరాళం అందించనున్నట్లు తెలిపారు. గ్రామంలో నిర్మిస్తున్న ప్రభుత్వ ఫంక్షన్ హాల్, మైనార్టీ ఫంక్షన్ హాల్స్ బ్యాలెన్స్ పనులు త్వరలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. చిన్న కంజర్ల రహదారిని సైతం విస్తరించనున్నట్లు తెలిపారు. ప్రజలలో భక్తి భావం పెంపొందించడంలో భాగంగా నూతన దేవాలయాలు, మసీదులు, ఆశీర్ఖానాలు, చర్చిలను సొంత నిధులతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.

**ఐనోలు సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక**

ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని ఐనోలు గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు చేయాలని.. గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను నివేదిక రూపంలో తనకు అందించాలని.. త్వరలో గ్రామంలో పర్యటించి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వెంకట్ రెడ్డి, అంతిరెడ్డి, శ్రీనివాస్, దుర్గారెడ్డి, హరీష్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు శివారెడ్డి, సల్మాన్ ఖాన్, నసీమా బేగం, సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, గ్రామ పుర ప్రముఖులు పాల్గొన్నారు.

## సాంక్రమిక వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన ముఖ్యం






### దోమల నివారణకై

### చెన్నాపురం పరిధిలో ఫ్రైడే డ్రై డే

### కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వసంత

**జవహర్‌నగర్, మే 29 (నినాదం):** సాంక్రమిక వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన ముఖ్యమని దోమల నివారణకై ప్రతి ఒక్కరు అప్రమత్తతతో నివారణ చర్యలు తీసుకోవాలని కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎన్. వసంత అన్నారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ చంద్రపురి కాలనీ డివిజన్లోని చెన్నాపురంలో శుక్రవారం ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో దోమల నివారణపై అవగాహన (ఫ్రైడే డ్రై డే) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కీసర డిప్యూటీ కమిషనర్ ఎన్. వసంత హాజరై మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రజలు సాంక్రమిక వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, దోమల నివారణకై ప్రతి ఒక్కరు నివారణ చర్యలు తీసుకోవాలని చికిత్స కంటే నివారణే ఉత్తమ మార్గమని తెలిపారు. దోమల నివారణకై పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుతూ మురుగునీరు నిలువలు ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి ఆవరణలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి ఇంటి వాతావరణాన్ని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి పరిసర ప్రాంతాలలోని చెత్త చెదారం నిల్వ ఉండకుండా శుభ్రంగా ఉంచినప్పుడే దోమలను అరికట్ట వచ్చునని తెలిపారు. ఇంటి ఆవరణలో నీటి తొట్లు పాత టైర్లు తదితర రేకు డబ్బాలు ఉండకుండా చూచుకోవాలని నీటితోట్లే దోమలకు ఆవాస కేంద్రాలని ఆవాసాలను రోజు ఎప్పటికప్పుడు శుభ్రపరచాలన్నారు. దోమ పుట్టకుండా ప్రత్యేక పద్ధతులతో దోమల నివారణ పై అవగాహన పెంచుకోవడం ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ భాస్కర్, తిరుపతి, రాజు, వార్డ్ ఎంట మాలజీ సూపర్వైజర్లు శ్రీనివాస్, స్వామి, కాలనీ అసోసియేషన్ సభ్యులు, ఎంటమాలజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ఆహ్వానం



**మల్కాజిగిరి, మే 29( నినాదం):** ప్రవీణ్ డాన్స్ కంపెనీ (పీడీసీ)... 4 వ వార్షికోత్సవం సందర్భంగా కాప్రా సర్కిల్ జూన్, 4వ తేదీన నార్త్ కమలా నగర్ రోడ్డు నెం 12 లో జూన్ 4 వ తేదీన జరిగే వార్షికోత్సవ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని సైనిక్‌పురిలోని తన నివాసంలో కోరియోగ్రాఫర్ ప్రవీణ్ మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమం లో బీఆర్ఎస్ నాయకులు నేమూరి మహేష్, లక్ష్మి నరసింహ స్వామి కాలనీ సెక్రటరీ, రిపోర్టర్ జె సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

### బ్యాలెట్ యూనిట్లను పరిశీలించిన కలెక్టర్



**వికారాబాద్, మే 29(నినాదం):** వికారాబాద్ జిల్లా తహసీల్దార్ కార్యాలయము పరిధిలో ఉన్న బ్యాలట్ యూనిట్లు, పోస్టల్ బ్యాలెట్లు భద్రపరచిన గోదామును జిల్లా కలెక్టర్ దీపక్ తివారి శుక్రవారము పరిశీలించారు. గోదాంలో భద్రపరిచిన ఈవీఎంలు, బ్యాలట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్ యంత్రాలు, పోస్టల్ బ్యాలెట్ల భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ సమీక్షించారు. రికార్డుల నిర్వహణ, సీసీ కెమెరాల పర్యవేక్షణ, భద్రతా సిబ్బంది విధులు తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఏలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గోదాంలో పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలు నిరంతరం పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎన్నికల విభాగ అధికారులు, నేమత్ హాలి పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### మాజీ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శికి నివాళి



**వికారాబాద్, మే 29(నినాదం):** తాండూర్ నియోజకవర్గ యాలాల్ మండలం మాజీ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ కుమార్ అకాల మరణ వార్త తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం వెళ్ళి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మండల అధ్యక్షులు, సీనియర్ నాయకుడు, కార్యకర్తల బృందం బాధిత కుటుంబాన్ని పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని, భవిష్యత్తులోనూ తోడుగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం పార్టీ తరపున ఆర్థిక సహాయం అందజేశారు. ప్రశాంత్ కుమార్ పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పాడె మోసి, అంత్యక్రియలు పూర్తయ్యే వరకు నాయకులు, కార్యకర్తలు అక్కడే ఉండి కుటుంబానికి ధైర్యం చెప్పారు. ప్రశాంత్ కుమార్ పార్టీ కోసం చేసిన సేవలు, యువజన విభాగాన్ని బలోపేతం చేయడంలో ఆయన చూపిన చొరవ ఎప్పటికీ మరువలేనివని నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ అధ్యక్షులు చెన్నారం అనిల్ సేట్, యాలాల మాజీ మండల అధ్యక్షులు అయ్యగళ్ల భీమయ్య, మండల అధ్యక్షులు మహిపాల్ యాదవ్, సీనియర్ నాయకులు జక్కెపల్లి అమృతయ్య, ఆడాల్పూర్ అనంతయ్య, సంగేమ్ హన్మంతు, ముకుందపూర్ సాయిలు, రఘు రామ్ రెడ్డి సత్యనారాయణ రెడ్డి, పగిడిపల్లి నర్సిములు, రాఘుపూర్ రాంచేందర్, పసిరి కాయల సాయిలు, దేవనూర్ ఖాసీం, దేవనూర్ శ్రీనివాస్ చారి యువనాయకులు గాజుల మన్నాన్, మరియు యాలాల్ మండల బిసీ సంఘం అధ్యక్షులు చెన్నారం లక్ష్మణ చారి తదితరులు పాల్గొన్నారు.

### గర్భిణులకు అవగాహన



**దుబ్బాక, మే 29 (నినాదం):** 99వ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈరోజు పెద్దగుండవెల్లి గ్రామంలోని అంగన్వాడీ సెకండ్ సెంటర్‌లో గర్భిణీలు, బాలింతలకు "1000 డేస్" ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ స్వరూప మాట్లాడుతూ గర్భధారణ నుంచి చిన్నారి రెండేళ్లు పూర్తి అయ్యే వరకు తొలి 1000 రోజులు అత్యంత కీలకమని, ఈ సమయంలో తల్లి మరియు శిశువు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని వివరించారు. అలాగే ప్రీస్కూల్ పిల్లలకు యూనిఫార్మ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ స్వరూప, అంగన్వాడీ టీచర్లు ఎల్లుల కవిత, రాళ్లపండి కవిత, సద్ది మమత, ఏఎన్ఎం రమ, రిటైర్డ్ టీచర్, ఆశా వర్కర్లు, గర్భిణీలు, బాలింతలు, ప్రీస్కూల్ పిల్లల తల్లులు పాల్గొన్నారు.

## గడపగడపకు భారతీయ జనతా పార్టీ





- 19వ రోజు సంకల్పయాత్ర నిర్వహించిన రావుల శేషగిరి
- బిజెపి జెండా ఎగరవేసిన కంది శ్రీరాములు

**కుత్బుల్లాపూర్, మే 29 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సెల్ కో కన్వీనర్ రావుల శేషగిరి కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ యండమూరి లేఅవుట్ లో భారతీయ జనతా పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "గడప గడపకు బీజేపీ - సంకల్ప యాత్ర" తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సెల్ కో కన్వీనర్ మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి నిర్వహించిన కార్యక్రమం విజయవంతంగా 19వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమానికి బీజేపీ నాయకులు కంది శ్రీరాములు ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. రావుల శేషగిరి నేతృత్వంలో కాలనీలోని ప్రతి ఇంటినీ సందర్శించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ యాత్ర ముఖ్య ఉద్దేశమని నాయకులు పేర్కొన్నారు. తెలంగాణ యువ మోర్చా మీడియా కో-ఆర్డినేటర్‌గా నూతనంగా నియమితులైన నాగదీప్ గౌడ్‌కు రావుల శేషగిరి, పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రముఖులు యాదగిరి యాదవ్, మురళీకృష్ణ, శ్రీధర్, శివానంద్, శంకర్ నాయుడు, రావుల రాజన్న, రావుల పృథ్వీ, భరత్ కుమార్, సునీల్ పాటిల్, నాగేష్, గురుస్వామి, జగదీష్, జోగారావు, మహేందర్ రెడ్డి, శారద, భవాని, లక్ష్మి, సరోజినీ, చిన్న మురళి, కార్తీక్, చింటూ, రిసేంద్రసాగర్, యాదిరెడ్డి, రమేష్ బాబు, రాజు, భద్రయ్య, సంజీవ్, అన్నాజీ, మంజునాథ్, ఓంకార్ రెడ్డి, రామారావు, ఎల్లేష్ లియండమూరి లేఅవుట్ కాలనీవాసులులి ఏ.వి .వి శ్రీనివాస్ రావు,వై. రామనాథం, పాన్ సింగ్ రావత్ , ఆర్. వెంకటేశ్వర్లు, ఏ సృజన రావు, జి వెంకట్ రెడ్డి, కంచి రవిచంద్ర, నవీన్ రెడ్డి శివానంద్, ఎం శ్రీనివాస్ రాయుడు, ఆకెలా శ్రీనివాస్, కే కృష్ణ యాదవ్, భార్గవ్ రెడ్డి, విజేందర్, చంద్రశేఖర్, నవీన్ రెడ్డి, రామకృష్ణ, కృష్ణారావు తదితర నాయకులు కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ రక్షణ సేన జెండా పండుగ






**కుత్బుల్లాపూర్, మే 29 (నినాదం):** తెలంగాణ రక్షణ సేన జెండా పండుగలో భాగంగా మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని మల్లంపేట్, బౌరంపేట్ ప్రాంతాల్లో పడాల మనోజ గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ రక్షణ సేన జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు నవీన్ చారి, కిషోర్ యాదవ్, కృష్ణవేణి, మారయ్య లు ముఖ్య అతిథులుగా హాజరైనారు. నవీన్ గోగిఖర్, సంధ్యారెడ్డి, సాత్విక రెడ్డి, వెంకన్న, కుమార్, శాంత, ఊర్మిళ, నవీన్, మనీష్, రాకేష్, సంతోష్, ఈశ్వర్, ఏఎల్బీ రాజు, శ్రీనివాస్ యాదవ్, మనోహర్, యశస్విని, వేణునాథ్, శామ్యూల్ రాజ్ తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. తెలంగాణ రక్షణ సేన జెండా పండుగ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు, యువకులు, ప్రజలు పాల్గొని తెలంగాణ రక్షణ సేన పట్ల తమ ఐక్యతను, అభిమానాన్ని చాటారు.

## 12వ రోజుకు చేరిన విఓఏల సమ్మె



**కొడంగల్, మే 29(నినాదం):** కొడంగల్ మండల కేంద్రం లోని మహిళా సమాఖ్య ఆవరణలో చేస్తున్న విఓఏ ల సమ్మె శుక్రవారం12వ రోజు కు చేరింది. శుక్రవారం విఓఏలు ఒంటికాలిపై నిలబడి నిరసన వ్యక్తంచేశారు. ఈకార్యక్రమంలో అంజిలప్ప, పెంటప్ప, వెంకట్ రెడ్డి, మొగులప్ప, సరోజ, గణేష్, రవి, కవిత పాల్గొన్నారు.

## ప్రజా పాలనా - ప్రగతి ప్రాణాలిక 99 రోజుల యాక్షన్ ప్లాన్





- దుండిగల్ డివిజన్‌ని సందర్శించిన జోనల్ కమీషనర్ పింకీష్ కుమార్ ఐఏఎస్

**కుత్బుల్లాపూర్, మెయిన్ 29 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం,బౌరంపేట్ డివిజన్ లోని పలు సమస్యలను టీపీసీసీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి దృష్టికి తీసుకుని వచ్చినందున జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ (ఐఏఎస్) దుండిగల్ డిప్యూటీ కమిషనర్ మనికరణ్ మున్సిపల్ అధికారులందరితో కలిసి పర్యటించి స్థానిక సమస్యల పరిష్కారం కోసం పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, బౌరంపేట్ మాజీ సర్పంచ్ యాది రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి భరత్ గౌడ్, జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శి చిరంజీవి,సీనియర్ నాయకులు విజయ్ గౌడ్, సురేష్, పోచి మహేష్, ఆంజనేయ వర్మ స్థానిక ప్రజలు, వివిధ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తులసి రమణాచార్యులకు ఘన సన్మానం



**అల్వాల్, మే 29 (నినాదం):** తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ తెలంగాణ సాహిత్య అకాడమీ గోల్కొండ సాహితీ కళాసమితి, తెలుగు భాషా చైతన్య సమితి అనుబంధ సంస్థలు ఆధ్వర్యంలో సురవరం ప్రతాప్ రెడ్డి జయంతి ఉత్సవం సందర్భంగా డా. మలుగ అంజయ్య చే శతావధాన కార్యక్రమం రవీంద్ర భారతిలో రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. శతావధానం ముగింపు సభకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి విచ్చేసి మాట్లాడుతూ ప్రపంచ దేశ భాషల్లో కెల్ల తెలుగు భాషా మహోన్నతమైనదని అన్నారు, విజ్ఞానం కోసం అన్యభాషలు నేర్చుకొన్న తప్పులేదు మాతృ భాషైన తెలుగు భాషను మరువరాదు అన్నారు. ప్రభుత్వ పరంగా సాహిత్య అకాడమీ కి ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు, తెలుగు సాహిత్య అకాడమీ కార్యదర్శి డా నమోజు బాలచారి మాట్లాడుతూ గడిచిన రెండున్నర సంవత్సరాల నుంచి సాహిత్య అకాడమీ ద్వారా ఎన్నో విభిన్నమైన కార్యక్రమాలు నిర్వహిస్తూ తెలుగు భాష చైతన్యానికి తోడ్పడుతున్నామని అన్నారు, ఈ సందర్భంగా మల్కాజ్ గిరి ప్రాంతానికి చెందిన కవి రచయిత అర్చకులు డా తులసి వెంకట రమణా చార్యులు అవధాన కార్యక్రమంలో పృచ్ఛకులుగా పాల్గొని సభికులను ఆకట్టుకున్నారు , రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి,సాహిత్య అకాడమీ కార్యదర్శి డా నమోజు బాలచారి, తెలుగు భాషా చైతన్య సమితి అధ్యక్షులు బడే సాబ్ దైవజ్ఞ శర్మ చేతుల మీదుగా సన్మానం అందుకొన్నారు. ఈ కార్యక్రమంలో అవధాని డా మలుగ అంజయ్య, సాహితీ వేత్త డా బి జయరాములు , నక్క శ్రీనివాస్ యాదవ్ ,గోల్కొండ సాహితీ కళాసమితి అధ్యక్షులు సి పి రెడ్డి , ప్రముఖ కవి గంట మనోహర్ రెడ్డి. రామకృష్ణ చంద్ర మౌళి, కవయిత్రి మూర్తి శ్రీదేవి, డా దాసోజు పద్మావతి, పోచం సుజాత,రావూరి వనజ ,శాంతా రెడ్డి కవులు శిఖా గణేష్ ,భోగయ్య గారి చంద్ర శేఖర్ శర్మ పరిమి సత్య మూర్తి తదితర ప్రముఖ సాహితీ మూర్తులు పాల్గొన్నారు.

# బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేసే వారిపై కఠినచర్యలు

పొగాకు ఉత్పత్తుల దుష్ప్రభావాలపై
విస్తృత అవగాహన కల్పించాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

జాతీయ పొగాకు నియంత్రణ చట్టం
జిల్లా కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆదేశాలు



**హనుమకొండ, మే 29, (నినాదం):** బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం (ఎన్టీడీపీ)లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ పొగాకు నియంత్రణ చట్టం (కోప్టా యాక్ట్ ) జిల్లా కోఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పొగాకు, పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే తీవ్రమైన ఆరోగ్య సమస్యలపై ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాలలకు 100 మీటర్ల పరిధిలో సిగరెట్లు, గుట్కా మరియు ఇతర పొగాకు ఉత్పత్తుల విక్రయం నిషేధమని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దేవాలయాలు, పాఠశాలలు, పార్కులు, ప్రభుత్వ కార్యాలయాలు మరియు ఇతర బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధించబడిందని పేర్కొంటూ, ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పొగాకు వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై యువతను భాగస్వామ్యం చేస్తూ ర్యాలీలు, అవగాహన సదస్సులు, ప్రచార కార్యక్రమాలునిర్వహించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో పొగ త్రాగడం వల్ల పరిసరాల్లో ఉన్న వారిపై కూడా తీవ్ర ప్రభావం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ నెల 31న నిర్వహించే ప్రపంచ పొగాకు నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రముఖ గుండె వైద్య నిపుణులు, శ్రీనివాస హార్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ రామకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు పొగాకు వల్ల కలిగే అనర్థాలపై పాఠశాల స్థాయి నుంచే అవగాహన కల్పించేలా పాఠ్యాంశాలు రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సంస్థలు, పారిశ్రామిక ప్రాంతాలు మరియు బహిరంగ ప్రదేశాల్లో నిషేధిత బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు.

జిల్లాలో పొగాకు సాగును నియంత్రించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ. అప్పయ్య జిల్లాలో చేపడుతున్న పొగాకు నియంత్రణ కార్యక్రమాలపై వివరాలు వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి మేన శ్రీను, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, జీడబ్ల్యూఎంసీ ముఖ్య వైద్యాధికారి డాక్టర్ రాజారెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి గోపాల్, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ శ్రీనివాస్, జిల్లా రవాణా శాఖ అధికారి వేణుగోపాల్, గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ సునీత, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర ఓటరు జాబితా సవరణ పూర్తి చేయాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుధర్శన్ రెడ్డి



**భూపాలపల్లి ప్రతినిధి, మే 29(నినాదం):** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుధర్శన్ రెడ్డి తెలిపారు. ఎస్ఐఆర్--2026 ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుధర్శన్ రెడ్డి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి ఐడిఓసి కార్యాలయం నుండి జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుధర్శన్ రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛమైన ఓటరు జాబితాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు బలమైన పునాది అని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బి ఎల్ ఓ లు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ చేపడుతుండగా, ఓటర్లు కూడా ఎలక్షన్ కమిషన్ ఇంటిగ్రేటెడ్ నెట్‌వర్క్ ద్వారా ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకునే సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో భూపాలపల్లి ఆర్డీఓ హరికృష్ణ, అన్ని మండలాల తహసీల్దార్లు, ఆర్ ఐ లు, బి ఎల్ ఓ లు, సూపర్వైజర్లు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు అబ్బాస్, నవీన్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల అడ్మిషన్లకు విద్యార్థుల వెల్లువ



**పెబ్బేరు, మే 29 (నినాదం):** పెబ్బేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు జోరుగా కొనసాగుతున్నాయి. విద్యార్థుల చేరికలను పెంచేందుకు కళాశాల అధ్యాపకులు ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరి ఉన్నత విద్యను అభ్యసించాలని తల్లిదండ్రులకు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరే విద్యార్థులకు అడ్మిషన్ ఫీజు లేకుండా ప్రవేశం కల్పించడంతో పాటు ఉచిత విద్య, స్కాలర్‌షిప్‌లు, ఉచిత పాఠ్యపుస్తకాలు వంటి పలు సౌకర్యాలు ప్రభుత్వం అందిస్తున్నట్లు అధ్యాపకులు వివరించారు. అదే విధంగా ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయనున్నట్లు తెలిపారు. జూన్ 12వ తేదీ నుంచి తొలి విడతగా 64 కళాశాలలో మిడ్‌డే మీల్స్ ప్రారంభమవుతాయని, నెలాఖరు నాటికి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టిఫిన్‌తో పాటు మధ్యాహ్న భోజనం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ, అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధన, మెరుగైన ఫలితాలు ప్రభుత్వ కళాశాలల ప్రత్యేకతలని తెలిపారు. ప్రైవేట్ కళాశాలలకు ఏమాత్రం తీసిపోకుండా ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా పెబ్బేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడు సి. కృష్ణయ్య ఎస్సీ వాడలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల అడ్మిషన్లు స్వీకరించారు. స్థానికులు, తల్లిదండ్రులు ప్రభుత్వ కళాశాలల అభివృద్ధిని అభినందించారు.

# రైతుల గోడు పట్టని మంత్రి శ్రీధర్ బాబు

కాంగ్రెస్‌కు ఓటు వేయడమే
రైతులు చేసిన పాపమా

40 యేళ్లుగా గెలిపిస్తే శ్రీధర్ బాబు
రైతులకు ఏం చేశారడు

మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్



**కాటారం, మే 29(నినాదం):** ధాన్యం కొనండని రైతులు గోడు వెల్లబోసుకుంటున్నా, మంత్రి స్వగ్రామంలో రైతులు రోడ్డెక్కి గగ్గోలు పెడుతున్నా ఏమీ పట్టనట్టు వ్యవహరించడం శోచనీయమని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ అసహనం వ్యక్తం చేశారు. కాటారం మండలం రేగులగూడెంలో శ్రీరుద్ర జిన్నింగ్ । మిల్లో గోదాంలో మూడు రోజులుగా అన్లోడింగ్ కోసం వెయిటింగ్లో ఉన్న లారీలు, గుమ్మళ్లపల్లి గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రంను శుక్రవారం రైతులతో కలిసి పుట్ట మధు పరిశీలించారు. మంథని నియోజక వర్గంలో నెల రోజులుగా రైతులు ధాన్యం కొనుగోళ్ల కోసం పడిగాపులు కాస్తుంటే మరోవైపు జిల్లా కలెక్టరేట్లో జరిగిన రివ్యూలో రైతులకు ఎలాంటి సమస్యలు లేవని మంత్రి శ్రీధర్ బాబు చెప్పడం హాస్యస్పదంగా ఉందన్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతుల పక్షాన నిలబడితే బీఆర్ఎస్, బీజేపీ పార్టీలవి రాజకీయాలనడం విడ్డూరంగా ఉందన్నారు. మంత్రి కళ్లు తెరిపించడానికే ప్రత్యక్షంగా ఇక్కడకు వచ్చామనీ, పోసిరెడ్డి అనే రైతు తన వడ్లు 50 రోజుల తర్వాత కూడా కాంటా వేయకుండా కవర్లు కప్పి ఇక్కడే ఉంటున్నాడనీ, ఇది మంత్రికి సమస్యగా కనిపించలేదా అని ప్రశ్నించారు. ఆయనది రైతు కుటుంబం కాదనీ, అందుకే ఈ ప్రాంతంకు తనకేమి సంబంధం లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నాడనీ, ఇక్కడి ప్రజలు, రైతులతో కేవలం ఓట్ల సంబంధం మాత్రమే ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గుమ్మళ్లపల్లిలో 3వేల ఎకరాలకు రైతు బంధు ఇచ్చి ఆదుకున్నామని గుర్తు చేశారు. తమది రాజకీయం కాదనీ, రైతులకు అండగా ఉండటం తమ బాధ్యత అని పేర్కొన్నారు. కష్టపడి పండించిన రైతులను నాడు కేసీఆర్ జవాన్లతో సమానంగా పోల్చాడని గుర్తు చేశారు. అన్నం పెట్టిన ప్రజలను మరిచిపోవడం మంత్రికి అలవాటేనన్నారు. తాము రైతుల గురించి మాట్లాడితే అపవాదులు చేఉన్నారని అన్నారు. ప్రత్యక్షంగా ఇక్కడే ఉండి మాట్లాడుతున్నామనీ, కేంద్రంకు వచ్చి చూడాలని డిమాండ్ చేశారు. కొండంపేట పత్తి మిల్లుకు । వెళ్తే అక్కడ నాలుగు రోజులుగా అన్లోడ్ గాకుండా లారీలు నిలిచిపోయా ఉన్నాయన్నారు. మంత్రి స్థానికంగా లేకపోయినా అతని సోదరుడినైనా కల్లాల వద్దకు పంపిస్తే రైతుల సమస్యలు తెలుస్తాయి అన్నారు.

**జైలు భరోకు శ్రీకారం..**

కాటారం సబ్ డివిజన్ పోలీసులు అతిగా చేస్తున్నారనీ త్వరలోనే జైలుభరోకు శ్రీకారం చుడుతామని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు హెచ్చరించారు. మొదట మంథని నుంచి అనుకున్నామనీ, కానీ, కాటారం నుంచే మొదలు పెడుతామన్నారు. రైతుల కోసం పోరాటం చేసిన బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెట్టించి చిత్ర హింసలకు గురి చేస్తున్నారన్నారు. త్వరలోనే కాటారం పోలీస్టేషన్కు బీఆర్ఎస్ నాయకులమందరం వస్తామనీ, అప్పుడు ఎంత మందిపై కేసులు పెడుతారో చూస్తామన్నారు. అక్రమ కేసులతో భయభ్రాంతులకు గుర ఇచేస్తున్న పోలీసుల చిట్టా రాసి పెట్టుకుంటున్నామన్నారు. ప్రతి పేరును పింక్ బుక్లో రాసుకుని మా ప్రభుత్వం రాగానే అమలు చేస్తమని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా మాజీ జడ్పీ చైర్పర్సన్ జక్కు శ్రీహర్షిణి, బీఆర్ఎస్ రాష్ట్ర నేత జక్కు రాకేష్, మండల అధ్యక్షుడు జోడు శ్రీనివాస్, సర్పంచ్లు సదవలి, వెంకటేశ్వరరావు, తోట జనార్ధన్, జక్కు శ్రావణ్, మానెం రాజబాబు, మహేశ్వర్ రెడ్డి, బోడ తిరుపతి, చీమల వంశీ, కొండగొర్ల వెంకటస్వామి, మునిమంద మధుకర్, ఐలి రాజబాబు, చిట్యాల సమ్మయ్య, శ్యాంసుందర్, కుదుదుల రాజబాబు, రవి, మనోహర్, గాలి సదవలి, శేఖర్, శ్రీలక్ష్మీ చౌదరి, నాగరాజు పాల్గొన్నారు.

## టాస్క్ కోర్సును పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత



**భూపాలపల్లి, మే 29(నినాదం):** టాస్క్ కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ.. యువతకు నైపుణ్యాభివృద్ధి ఎంతో అవసరమని, ఇటువంటి కోర్సులు విద్యార్థుల భవిష్యత్తుకు దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులు నేర్చుకున్న నైపుణ్యాలను ఉపయోగించుకుని మంచి అవకాశాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సాంకేతిక విద్యతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య పలువురు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు ,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## లక్ష్మీనరసింహస్వామి వారికి నిత్య కళ్యాణం



**హుజూర్ నగర్ (మఠంపల్లి) మే 29 (నినాదం):** శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానం, మట్టపల్లి మహాక్షేత్రం నందు శుక్రవారం శ్రీ స్వామి వారికి ప్రాతఃకాలమున నిత్యాభిషేకములు, నిత్య హోమములు జరిగినవి. తదుపరి స్వాతి కళ్యాణం మరియు గరుడ సేవ దేవాలయ అర్చకులు తూమాటి రామాచార్యులు, పద్మనాభచార్యులు, లక్ష్మీనరసింహ మూర్తి, ఆంజనేయ చార్యులు వార్లచే శాస్త్రోతముగా నిర్వహించబడినది. మధ్యానం దేవాలయం అన్నదానంలో 120మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగినది.

## రైతు సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో పర్యటించిన ఎస్పీ

**భూపాలపల్లి, మే 29(నినాదం):** రైతు సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ పర్యటన భూపాలపల్లి జిల్లా గోర్లవీడు గ్రామంలోని వెంకటేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లును జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, సీఐ నరేష్ కుమార్‌లతో కలిసి పరిశీలించారు. మిల్లులో వడ్ల నిల్వ, ప్రాసెసింగ్ విధానం, రోజుకు ఎంత మేర వడ్లు స్వీకరిస్తున్నారనే అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రైతుల నుండి సాధ్యమైనంత ఎక్కువ వడ్లను పారదర్శకంగా కొనుగోలు చేయాలని సూచించడం జరిగింది. అలాగే రానున్న రోజుల్లో వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున వడ్ల లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని రైస్ మిల్ యాజమాన్యానికి సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని వడ్ల కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులను స్థానిక పోలీస్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రోజువారీ వడ్ల కొనుగోలు, ఎగుమతులపై నివేదికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించాలని ఆదేశించారు.



# కర్ణాటక రాష్ట్రంలోని పంటలు పరిశీలన

**అమరచింత, మే 29, (నినాదం):** కర్ణాటక రాష్ట్రంలోని బెల్గాం జిల్లా గోకాట్ తాలూకాలోని కల్లోలి గ్రామంలో బాలప్ప బేలకూడు అనే రైతు పండించిన పంటలను శుక్రవారం కృష్ణవేణి చెరుకు పరిశ్రమ రైతులు, కృష్ణవేణి పరిశ్రమ పరిశీలించారు. 3, ఎకరాల్లో 390 టన్నులు ఎకరానికి 130 టన్నులు పండించిన రైతు వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. బాలప్ప రైతు తాను ఎకరములో 130 టన్నులు వర్మి డి కంపోస్ట్ ఫర్టిలైజర్ వాడే విషయాల్ని మెలకువలు మాకు చెప్పినాడు బాలప్ప అనే రైతు ఏఐ టెక్నాలజీ ద్వారా 5, ఎకరాల్లో వెయ్యి టన్నులు , ఎకరంలో 200 టన్నులు,పండించాలని 5 ఎకరాల భూమిని సిద్ధం చేసినాడు. బాలప్ప బెలకోడు రైతు వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన కృష్ణవేణి సిబ్బంది అమరచింత నర్వ ఏరియా మేనేజర్లు రాములు, హేమాద్రి, కృష్ణవేణి పరిశ్రమ చెరుకు రైతు సంఘం ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా అధ్యక్షులు రాజన్న ప్రధాన కార్యదర్శి జి రవి సహాయ కార్యదర్శి టి వీరన్న ఉమ్మడి జిల్లా కమిటీ సభ్యులు తిరుపతయ్య బి రాజు రవీందర్ రెడ్డి రామకృష్ణ రామ్ రెడ్డి వెంకటేష్ వి విష్ణు వర్ధన్ కురుమన్న రవీందర్ రెడ్డిలు పాల్గొన్నారు.



## రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు చేయాలి

కలెక్టర్‌ను కలిసిన బీజేపీ నాయకులు



**అమరచింత, మే 29, (నినాదం):** ఆత్మకూరు మదనపూర్ మండలాల్లో వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తూకం పట్టిన ధాన్యాలు వెంటనే తరలించాలని కలెక్టర్ ఆదర్శ సురభిని బిజెపి నాయకులు శుక్రవారం విజ్ఞప్తి చేశారు. ఆత్మకూర్ పిఏసిఎస్ రిధిలోని గ్రామాల్లో రేచింతల పిఎసిఎస్‌ల పరిధిలోతూకం చేసి నిల్వ ఉంచిన టువంటి వరి ధాన్యాన్ని వెంటనే తరలించాలని సందర్భంగా కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దాబా శ్రీనివాస్ రెడ్డి కలెక్టటర్ రను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తక్షణమే చర్య తీసుకుంటామనిహామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మక్తల్ అసెంబ్లీ కో కన్వీనర్ రేచింతల శ్రీనివాస్ మదనపురం మండల బిజెపి అధ్యక్షులు రామకృష్ణారెడ్డి మదనాపురం మాజీ మండల అధ్యక్షులు కృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ గద్దె రామారావుకు ఘన నివాళులు



**కోదాడ,మే 29(నినాదం):** అనంతగిరి మండలం వాయిలసింగవరం గ్రామంలో మాజీ సర్పంచ్ గద్దె రామారావు 11వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆయన విగ్రహానికి గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు, యస్వీ విద్యాసంస్థల వైస్ చైర్మన్ గద్దె రఘు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు, గద్దె రామారావు గ్రామాభివృద్ధికి విశేష సేవలు అందించారని కొనియాడారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కొల్లు వెంకటేశ్వరరావు, బుర్రా వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## లైసెన్స్ డీలర్ వద్ద విత్తనాలు కొనుగోలు చేయాలి

డీఏఓ బాబురావు



**మహాదేవపూర్ మే 29, (నినాదం):** లైసెన్స్ కలిగిన డీలర్ వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు అన్నారు. శుక్రవారం మహాదేవపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ డివిజన్ డీలర్స్ మరియు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విత్తనాలు ఎంపిక చేసుకునే ముందు తగు జాగ్రత్తలు పాటించాలని లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని తెలిపారు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు డీలర్ వద్దనే లేబుల్ చూసి విత్తనాలు కొనుగోలు చేయాలని, రైతులు కచ్చితంగా ఆ యొక్క సీడ్ ప్యాకెట్ మరియు బిల్లులు సీజన్ అయిపో యేంతవరకు భద్రపరచుకోవాలని సూచించారు. కాటన్ లో బిటి -3 విత్తనాలు నిషేధం గురించి వివరించారు వరిలో 8 రకాల కు మాత్రమే బోనస్ లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాదేవపూర్, మల్హార్, కాటారం, మహా ముత్తారం, పలిమెల మండలాల ఏవోలు శ్రీజ, పూర్ణిమ, అనూష, సంపత్ తో పాటు ఏఈఓ లు, డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను జూన్ 15నాటికి పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియపై అధికారులు, బిఎల్వో సూపర్వైజర్లతో కలెక్టర్ సమీక్షా సమావేశం



**హనుమకొండ,మే29, (నినాదం):** ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియ జూన్ 15 నాటికి పూర్తి చేయాలని బూత్ లెవెల్ ఆఫీసర్స్, సూపర్వైజర్లను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో ఎస్ ఐ ఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయడంపై తహసిల్దార్లు, బి ఎల్ వో సూపర్వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ మ్యాపింగ్ ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లు దొర్లకుండా సక్రమంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. మ్యాపింగ్ ప్రక్రియలో డోర్ టు డోర్ సర్వే చేసి ఎటువంటి పొరపాట్లు లేకుండా సక్రమంగా నిర్వహించాలని, అవసరమైతే వివరాల నిమిత్తం పక్కనే ఉన్న కుటుంబాలను సంప్రదించాలని పేర్కొన్నారు. బూత్ లెవెల్ ఆఫీసర్లు. సూపర్వైజర్లు సమన్వయంతో ప్రతిరోజు సమయం కేటాయించి ఇంటింటా సర్వే నిర్వహించాలని తెలిపారు. అధికారులు ప్రతిరోజు మానిటరింగ్ చేసి మ్యాపింగ్ ప్రక్రియ సమర్థవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఇప్పటివరకు పనిచేయని బిఎల్‌ఓలను తొలగించి వారి స్థానంలో నూతనంగా బిఎల్ఓ లను నియమించాలన్నారు.

హనుమకొండ జిల్లాలో 2012 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉన్న ప్రతి బూత్ లో వలస వెళ్లిన ఓటర్లు, మరణించిన ఓటర్లు, ఓటర్ల జాబితాలో డబుల్ పేర్లు ఉన్న వారి వివరాలు కూడా పూర్తిస్థాయిలో విచారించి ఎటువంటి పొరపాటు జరగకుండా తొలగించాలని అన్నారు. జూన్ 15 నుండి జూలై 25 వరకు నూతన ఓటర్ల నమోదు కార్యక్రమం, దరఖాస్తుల ఫారాల పంపిణీ, నూతన ఓటర్ల నమోదు ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. పరకాల నియోజకవర్గ పరిధిలో ఉన్న గీసుకొండ, ఖిలా వరంగల్, సంగెం మండలాలలో మ్యాపింగ్ ప్రక్రియ తక్కువగా ఉందని, అక్కడ మరింత వేగం పెంచి మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత సూపర్వైజర్లను ఆదేశించారు. సకాలంలో మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయని వారిపై చర్య తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి, డిఆర్ఓ శ్రీనివాస్, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్,డీఎస్. వెంకన్న. తహసీల్దార్లు, బిఎల్‌వో సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు సిబ్బందికి భవిష్యత్ లక్ష్యాలపై దిశానిర్దేశం

• జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



**సంగారెడ్డి బ్యూరో, మే 29 (నినాదం):** స్పార్క్ కార్యక్రమంలో భాగంగా ఖాకీ కిడ్స్, పోలీసు సిబ్బందికి భవిష్యత్తు లక్ష్యాలపై జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ శుక్రవారం దిశా నిర్దేశం చేశారు. నిరంతరం శాంతి భద్రతలు, ఇతర రక్షణ విధులలో నిమగ్నమయ్యే సిబ్బంది, వారి కుటుంబాలకు చెందిన పిల్లలు ఎవరైతే పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నారో వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, వారికి సరైన మార్గనిర్దేశం ఇవ్వాలనే సంకల్పంతో సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి స్పార్క్ అనే కార్యక్రయాన్ని చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు కుటుంబాలకు చెందిన పిల్లల ప్రతిభను ప్రోత్సహిస్తూ, వారి విద్యా ప్రగతికి తోడ్పడాలనే ఉద్దేశ్యంతో నిర్వహిస్తున్న కార్యక్రమమే స్పార్క్ అన్నారు. ప్రతి శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహిస్తున్న "స్పార్క్" కార్యక్రమం ద్వారా పోలీసు కుటుంబాలకు చెందిన పిల్లలు మరియు పోలీసు సిబ్బంది వ్యక్తిగత, వృత్తిపరమైన అభివృద్ధి సాధించేందుకు విలువైన సూచనలు, సలహాలు అందించడంతో పాటు పర్సనాలిటీ డెవలప్మెంట్ శిక్షణ తరగతులు కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా, విధుల విరామ సమయంలో సిబ్బంది చదువుకునేందుకు జిల్లా పోలీసు కార్యాలయంలో లైబ్రరీ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఖాకీ కిడ్స్‌కు భవిష్యత్తులో ఉన్న అవకాశాలు, విద్య యొక్క ప్రాముఖ్యత, లక్ష్య సాధన, క్రమశిక్షణ మరియు వ్యక్తిత్వ వికాసంపై పలు సూచనలు చేశారు. చిన్నప్పటి నుంచే స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగాలని, ప్రతిరోజూ న్యూస్ పేపర్ చదవడం అలవాటుగా చేసుకోవాలని సూచించారు. పోలీసు సిబ్బంది విధులతో పాటు కుటుంబ సభ్యుల భవిష్యత్తుపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని, పిల్లల విద్యాభివృద్ధికి ప్రోత్సాహం అందించాలని సూచించారు. అర్హత కలిగిన సిబ్బంది కూడా సమయానుసారంగా చదువుకొని పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న పోలీసు సిబ్బంది, ఖాకీ కిడ్స్ మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడులే ఉన్నత చదువులకు నిలయాలు

**మంత్రి వాకిటి శ్రీహరి**

**పి ఆర్ టి యు టి ఎస్ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేత**

**100% ఉత్తీర్ణత సాధించిన ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎం లకు సన్మానం**






**నారాయణపేట ప్రతినిధి, మే 29, (నినాదం):** నారాయణ పేట జిల్లా కేంద్రంలోని అంజనా గార్డెన్స్ లో శుక్రవారం పీ ఆర్ టీ యూ టీ ఎస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థి విద్యార్థులకు ప్రతిభా అవార్డుల ప్రధానోత్సవం, అలాగే వంద శాతం ఉత్తీర్ణత సాధించిన ప్రభుత్వ పాఠశాలల హెచ్ ఎం లకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పీఆర్టి యూ జిల్లా శాఖ ఏర్పాటు చేసిన ఈ ప్రతిభా అవార్డుల కార్యక్రమం విద్యార్థుల తో పోటీ తత్వాన్ని పెంచుతుందని, అవార్డు తీసుకోవాలని వారిలో కసి పెరు గుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వాళ్లే ఉన్నత స్థాయికి ఎది గారని, తల్లిదండ్రులు ప్రైవేటు స్కూళ్లలో కాకుండా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలి అని మంత్రి సూచించారు. ప్రభుత్వ బడులు సిరులు అని, ప్రభుత్వ ఉపాధ్యాయులు మనకు ఒక వరం అని మంత్రి అభివర్ణించారు. ప్రభుత్వ పాఠశాల విద్యాబోధన లో మన కష్టం , చెమట బిదరికం ఉంటాయ న్నారు. ప్రభుత్వ పాఠశాల లో చదువుకున్న వాళ్ళకి భవిష్యత్తులో తాను చదువుకున్న బడికి, ఉన్న ఊరికి ఏదైనా చేయాలనే తపన ఉంటుందన్నారు. ప్రభు త్వ పాఠశాలలను బలోపేతం చేయడం మన అందరి బాధ్యత అని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రం వ్యాప్తంగా పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మన జిల్లా 19 వ స్థానం నుంచి 14 కి ఎగబాకిందని, భవిష్యత్తులో 1 వ స్థానానికి చేరుకోవాలని మంత్రి ఆకాక్షించారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు స్వయంగా తన నిధులు 25 లక్షలతో డిజిటలైజ్డ్ యానిమేషన్ కార్యక్రమాన్నీ మక్తల్ లో ప్రవేశ పెట్టి నట్లు మంత్రి తెలిపారు. ఇప్పుడు ప్రతిభా అవార్డులు అందుకున్న విద్యార్థుల ఫోటోలతో ఆయా ప్రభుత్వ పాఠశాలల బయట ఫ్లెక్సీలు పెడితే మిగతా విద్యార్థు లకు స్పూర్తిగా ఉంటాయని, ఫ్లెక్సీలు తప్పక పెట్టాలని మంత్రి కలెక్టర్కు సూచన ప్రాయంగా తెలిపారు. విద్యారు లు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటాలని సూచించారు. విద్యార్థులకు పదో తరగతి తర్వాత వచ్చే ఇంటర్ మీడియట్ చాలా కీలకం అని, పదో తరగతి తర్వాత తల్లి దండ్రులు, ఉపాధ్యాయుల మాట వింటే 6 సంవత్సరాల్లో ఉన్నత స్థాయిలో ఉంటారని, ఇంటర్ మీడియట్ ఒక టర్నింగ్ పాయింట్ అని మంత్రి తెలిపారు. ఉపాధ్యాయులు ఒత్తిడిలో ఉండరాదని, ప్రభుత్వం ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు కల్పించిందని, ఉపాధ్యాయుల కోరికలు న్యాయ బద్ధమై నవి, ప్రతి అంశాన్ని ప్రభుత్వం పరిశీలి స్తుందని ఆయన తెలిపారు. మన జిల్లాకు చెందిన నాయకుడే సీఎంగా ఉన్నారని, విద్యా శాఖ కూడా ముఖ్యమంత్రి వద్దనే ఉందని, ఉపాధ్యాయులు ప్రస్తావించిన విద్యా శాఖ సమస్యలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం సీఎం రేవంత్ రెడ్డి తో చర్చిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. మక్తల్ - నారాయణ పేట - కొడంగల్ ఎత్తిపోతల పథకం పూర్తయితే లక్షా 20 వేల ఎకరాలకు సాగు నీరు అందు తుందని, తద్వారా ఆర్థిక స్థితిగతులు మెరుగుపడి, విద్యావ్యవస్త బాగు పడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి మాట్లా డుతూ.. అవార్డులు అందుకున్న విద్యార్థు లు భవిష్యత్తు లోనూ ఇలాగే ఉత్తమ ప్రతిభ చాటాలని సూచించారు. మెరుగైన సమాజ నిర్మాణం బావి భారత పౌరులపై ఉందన్నారు. పదో తరగతి వరకు అన్ని సబ్జెక్టులు చదివారని, ఇప్పుడు మీకు నచ్చిన సబ్జెక్టు ఎంచుకుని కష్టపడి చదివి పుట్టిన ఉరికి, జిల్లా, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ప్రభుత్వం విద్యాశాఖ కు అన్ని రకాలుగా సహకారం అందిస్తోందని, విద్యా శాఖను తన వద్దే ఉంచుకుని విప్లవాత్మక మార్పులకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుడుతున్నారని చెప్పారు. విద్యా శాఖ పట్ల సీఎం కు ఎంత శ్రద్ధ ఉందో అర్థం అవుతుందన్నారు. యంగ్ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం, పాఠశాలల్లో ఉదయం అల్పాహారం అమలు చేయబోతున్నారని ఎమ్మెల్సీ తెలిపారు. జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షా ఫలితాలతో పాటు ఎఫ్.ఎల్. ఎన్, ఎస్.ఈ.ఆర్.టి లో మన జిల్లా ర్యాంకు సాధించడం గొప్ప విషయం అన్నారు. అత్యధిక మార్కులు సాధించిన వారిలో ముగ్గురు అమ్మాయిలే అని, జిల్లాలో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలల కంటే ఎక్కువగా ఉండటం అభినందనీయం అన్నారు. బడి బాట కార్యక్రమం ద్వారా ఎన్ రోల్ మెంట్ పెంచి వచ్చే విద్యా సంవత్సరం ఇంకా మెరుగైన ఫలితాలు సాధించేందుకు మనమంతా కృషి చేద్దాం అన్నారు. విద్యా శాఖ లో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని, ప్రభుత్వం కల్పిస్తున్న కొత్త కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ప్రతీ విద్యార్థిలో ఒక కళ ఉంటుందనీ, దానిని ఉపాధ్యాయులు గుర్తించి విద్యార్థులకు దిశా నిర్దేశం చేయాలని, ఉపాధ్యాయులే మార్గ దర్శకులని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలన విద్యతోనే సాధ్యం అవుతుందని ఆమె స్పష్టం చేశారు. అనంతరం అత్యధిక మార్కులు సాధించిన జిల్లాలోని ప్రభుత్వ పాఠ ఓశాలలకు చెందిన విద్యార్థినీ విద్యా ర్థులకు మంత్రి, ఎమ్మెల్సీ, కలెక్టర్ చేతుల మీదుగా ప్రతిభా అవార్డులను ప్రధానం చేశారు. పీ అర్ టీ యూ జిల్లా అధ్యక్షుడు యాదగిరి జనార్దన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పుర చైర్ పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సదా శివారెడ్డి, జిల్లా విద్యా శాఖ అధికారి గోవింద రాజులు, పీఆర్ టి యూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి , ఎం ఈవోలు, సెక్టోరల్ అధికా రులు విద్యా సాగర్, శ్రీనివాస్, నాగార్జున రెడ్డి, రాజేంద్ర కుమార్, హెచ్ ఎం లు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఆందోళన చెందొద్దు

**చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం**

**మంత్రి శ్రీధర్ బాబు**



**కాటారం, మే 29(నినాదం) :** రైతులు ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఎలాంటి ఆందోళన గురి కావద్దని రాష్ట్ర ఐటీ, పరి శ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచించారు. మండలకేంద్రంలోని ఏఎంసీ కొనుగోలు కేంద్రాన్ని మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు శుక్రవారం పరిశీలించారు. రైతులు, హమాలీలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని తప్పకుండా సేకరిస్తామని, ప్రైవేటు గోదాములను వినియోగిస్తూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. అదనపు హమాలీలను నియమించి ధాన్యం తరలింపును వేగవంతం చేస్తున్నామని, రైతులు తీసుకొచ్చిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్పర్సన్ పంతకాని తిరుమల, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాపు, డీసీసీ అధికార ప్రతినిధి సమ్మయ్య, పీఏసీఎస్ చైర్మన్ ప్రశాంత్, సీఈవో సతీష్, నాయకులు ప్రభాకర్ రెడ్డి, సందీప్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

# గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో పెబ్బేరు విద్యార్థిని ప్రతిభ

**కీబోర్డ్ స్వరాలతో మెరిసిన నలవాల అభివర్శిని తేజ**



**పెబ్బేరు, మే 29 (నినాదం):** కీబోర్డ్‌పై సరళ స్వరాలు పలికించి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించి పెబ్బేరు పట్టణానికి చెందిన విద్యార్థిని నలవాల అభివర్శిని తేజ ప్రతిభ చాటింది. చదువుతో పాటు సంగీత రంగంలోనూ రాణించాలని తల్లిదండ్రులు అందించిన ప్రోత్సాహంతో ఆమె ఈ అరుదైన ఘనతను సాధించింది. పెబ్బేరు పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయులు, టీవీ5 రిపోర్టర్ నలవాల విజయ్ కుమార్, రాణి దంపతుల కుమార్తె అయిన అభివర్శిని తేజ ఐదు నెలల పాటు ఆన్‌లైన్ కీబోర్డ్ ప్లేయింగ్ శిక్షణ పొందింది. ఈ క్రమంలో ఫిబ్రవరి 2న హైదరాబాద్‌లోని జురాస్టియన్ క్లబ్‌లో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక కీబోర్డ్ ప్లే కార్యక్రమంలో పాల్గొంది. ఈ కార్యక్రమంలో ప్రపంచంలోని 22 దేశాలకు చెందిన సుమారు 2000 మంది కీబోర్డ్ వాయిద్యకారులు పాల్గొని గంటపాటు నిర్విరామంగా సరళ స్వరాలు వినిపించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన 777 మందిని ఎంపిక చేయగా, నలవాల అభివర్శిని తేజకు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా హైదరాబాద్ గచ్చిబౌలిలోని విక్టరీ ఆడిటోరియంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో హల్లెల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకులు అగస్తిన్ దండగి చేతుల మీదుగా మెడల్, సర్టిఫికెట్‌ను అందుకుంది. ప్రస్తుతం అభివర్శిని తేజ పెబ్బేరు పట్టణంలోని మాస్టర్ మైండ్స్ ఒలింపియాడ్ హై స్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. ఈ అవార్డును ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తన తాతయ్య కీ.శే. నలవాల కర్రెన్నకు అంకితం చేస్తున్నట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. అభివర్శిని తేజ సాధించిన ఈ విజయంపై కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# బూత్ స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలి

**ప్రగతి రిసార్ట్స్‌లో ముగిసిన రంగారెడ్డి జిల్లా 'ప్రశిక్షణ మహాభియాన్'**

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు**





**రాజేంద్రనగర్, మే29( నినాదం):** భారతీయ జనతా పార్టీని క్షేత్రస్థాయిలో, బూత్ స్థాయి నుంచి అన్ని విధాలుగా బలోపేతం చేయాలని పార్టీ శ్రేణులకు నాయకులు పిలుపునిచ్చారు. బీజేపీ రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రగతి రిసార్ట్స్‌లో నిర్వహించిన రెండవ రోజు ముగింపు "ప్రశిక్షణా మహాభియాన్" కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ ముగింపు సభకు కేంద్ర గనుల, బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అధ్యక్షత వహించగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిక్షణా తరగతుల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి రాష్ట్ర ముఖ్య నాయకులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం జరిగిన ప్రత్యేక సమావేశంలో బీజేపీ జాతీయ నాయకులు మురళీధర్ రావు పాల్గొని 'పార్టీ చరిత్ర - వికాసం' అనే అంశంపై సుదీర్ఘంగా ప్రసంగించారు. పార్టీ ఆవిర్భావం, సిద్ధాంతాలు, దేశ నిర్మాణంలో కార్యకర్తల పాత్ర, భవిష్యత్ కార్యాచరణపై ఆయన దిశానిర్దేశం చేశారు. ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో పనిచేస్తూ పార్టీ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా శ్రమించాలని పిలుపునిచ్చారు. బూత్ స్థాయి కమిటీలను పటిష్టం చేసుకుంటూ ప్రజా సమస్యలపై పోరాడాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, వివిధ మోర్చాల ప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## N NADAM CINEMA

# పెద్దిలో అప్పలసూరిగా జగపతిబాబు



అప్పలసూరిగా 'పెద్ది'లో తన నటనతో ఆకట్టుకునేందుకు సిద్ధమయ్యారు నటుడు జగపతి బాబు . రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న జగపతిబాబు తన కెరీర్ గురించి మాట్లాడారు. మన కష్టానికి తగిన ఫలితం కచ్చితంగా లభిస్తుందన్నారు. సినిమా రంగంలో ఉన్నంత ఆనందం నాకు ఇంక ఎందులోనూ కనిపించదు. ఇందులో ఏదైనా సాధ్యమవుతుంది. సహజంగా నా జీవితంలో ప్రతిదీ ఆలస్యంగా వస్తుంది. కెరీర్‌లో కూడా మొదట ఫ్లాప్‌ల నుంచి హిట్‌లకు వచ్చాను. అందుకే పరాజయాలను పెద్దగా పట్టించుకోను. ఏదో ఒకరోజు విజయం తప్పక వస్తుంది నమ్ముతా. జీవితం మన అంచనాలకు అందదు. తర్వాత ఏం జరుగుతుందో ఎవరికీ తెలీదు. కానీ, ప్రతి ఒక్కరికి కష్టాలు కామన్‌గా ఉంటాయి. నేనూ ఎన్నో కష్టాలు పడ్డాను. ఇలా జరిగిందేంటని ఎప్పుడూ బాధపడలేదు. వాటి నుంచి ఏదో కొత్త పాఠం నేర్చుకున్నాను. కష్టానికి తగిన ప్రతిఫలం వస్తుందని ఎప్పుడూ నమ్ముతాను. బాధ వెనక సంతోషం కచ్చితంగా ఉంటుంది. నేను 2011 నుంచి 2013 వరకు ఎంతో బాధ అనుభవించా. దానికి తగిన సంతోషం ఇప్పుడు వచ్చింది. నా టైమ్ ఇప్పుడు స్టార్ట్ అయింది అనుకుంటున్నా అని జగపతి బాబు అన్నారు. సినిమాల విషయంలో ఎప్పుడూ ఒత్తిడికి గురి కాలేదని జగపతి బాబు ఈ సందర్భంగా తెలిపారు. ఫ్యామిలీ ఇష్యూ కాకుండా ఇంకా దేనిని పెద్ద సమస్యగా తీసుకోనని అన్నారు. 'పెద్ది'లో తనకు, రామ్ చరణ్‌కు మధ్య ఉండే బంధం అందరికీ నచ్చుతుందన్నారు. చరణ్ అన్ని సినిమాలకు కష్టపడతారని.. ఈ చిత్రంలో శరీరాకృతిని మార్చుకోవడం కోసం మరింత ఎక్కువ శ్రమించారని చెప్పారు.

# గ్లామర్ షోతో కుర్రకారుకు చెమటలు పట్టిస్తున్న అవికా గోర్



సీరియల్స్ ద్వారా కెరీర్‌ను ప్రారంభించి సినిమాల్లో అద్భుతంగా రాణించిన ముద్దుగుమ్మల్లో అవికా గోర్ ఒకరు. ఈమె రాజ్ తరుణ్ ప్రధాన పాత్రలో నటించిన ఉయ్యాల జంపాల చిత్రంతో వెండితెరకు పరిచయమైంది. ఈ సినిమా మంచి విజయం సాధించడంతో తెలుగులో ఈమెకు వరుస అవకాశాలు రావడం మొదలైంది. అందులో కొన్ని సినిమాలు మంచి విజయాలు కూడా అందుకున్నాయి. తాజాగా ఈ బ్యూటీ నందు ప్రధాన పాత్రలో రూపొందిన అగ్లీ స్టోరీ చిత్రంలో హీరోయిన్‌గా నటించింది. ఈ మూవీ కొన్ని రోజుల క్రితమే థియేటర్లలో విడుదలైంది. కెరీర్ ప్రారంభంలో అందాల ఆరబోతకు కాస్త దూరంగా ఉన్న ఈ బ్యూటీ, ఆ తర్వాత తన గ్లామర్‌తో యువతను బాగానే ఆకట్టుకుంది. సినిమాల్లో మాత్రమే కాకుండా సోషల్ మీడియా వేదికగా కూడా ఈ నటి తన అందాలను అభి మానులతో పంచుకుంటూ వస్తోం ది. తాజాగా ఈ ముద్దుగు మ్మకి సంబంధించిన కొన్ని ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతు న్నాయి. అందులో తన హాట్ ఎద అందాలు హైలైట్ అయ్యేలా ఫోజులు ఇచ్చింది. ఈ ఫోటోలలో ముఖంపై పడేలా కురు లను వదిలేసి, చెవులకు ఇయర్ రింగ్స్ ధరించి స్టైలిష్‌గా కనిపించింది. మొత్తంగా ఈ పిక్స్‌లో అవికా గోర్ సూపర్ హాట్ లుక్‌లో కనిపించడంతో అవి ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

# 'ది రెడ్ బ్యాగ్' నుంచి హీరోయిన్ లుక్ రిలీజ్..



రవి కుమార్ సీరపు దర్శకత్వంలో తెరకెక్కుతున్న సరికొత్త సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రం 'ది రెడ్ బ్యాగ్' . ఈ సినిమాను హరి కృష్ణ సోమిశెట్టి ఎక్కడా రాజీ పడకుండా ఎంతో ప్రతిష్టా త్మకంగా నిర్మిస్తున్నారు. ఒక రహస్యమైన బ్యాగ్ చుట్టూ తిరిగే ఉత్కంఠభరితమైన కథతో రూపొందుతోంది. ఈ చిత్రంలో రాధ్య హీరోయిన్‌గా నటిస్తుండగా.. షూటింగ్ చాలా శరవేగంగా జరుపుకుంటోంది. తాజాగా, మూవీ మేకర్స్ హీరోయిన్ రాధ్య ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో హీరోయిన్ రాధ్య చేతిలో ఒక గన్ పట్టుకుని ఎంతో పవర్‌ఫుల్ లుక్‌లో కనిపించింది. ఆమె లుక్‌తో పాటు చేతిలో ఉన్న ఆ 'రెడ్ బ్యాగ్' కూడా పోస్టర్‌లో హైలైట్‌గా కనిపిస్తోంది. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను షేర్ చేస్తూ మేకర్స్ పెట్టిన క్యాప్షన్ సినిమాపై అంచనాలను పెంచే స్తోంది. "న్యూ ఫేస్.. న్యూ ఫైర్.. న్యూ ఎరా.. ఆమె రూల్స్ పాటించడానికి రావట్లేదు.. ఒక కొత్త హిస్టరీ క్రియేట్ చేయడానికి వస్తోంది" అంటూ రాధ్య క్యారెక్టర్‌ను చాలా పవర్‌ఫు ల్‌గా ఇంట్రడ్యూస్ చేశారు. ఈ పోస్టర్ చూ స్తుంటే సినిమాలో హీరోయిన్ పాత్ర చాలా డిఫరెంట్‌గా, యాక్షన్ ఓరియెంటెడ్‌గా ఉండబో తోందని అర్థమవుతోంది. ఇక ఈ సస్పెన్స్ థ్రిల్లర్‌లో సీనియర్ నటి రాశీ ఒక కీలక పాత్రలో కనిపిం చబోతున్నారు. ఆమెతో పాటు టాలీవు డ్‌లో విలన్ పాత్రలతో గుర్తింపు తెచ్చుకున్న కబీర్ దుహాన్ సింగ్, ప్రసాద్ బెహరా, మోనిక కీలక పాత్రలో కనిపించనున్నారు. ఒక రహస్యమైన బ్యాగ్ వెనుక ఉన్న మిస్టరీ ఏంటి? ఆ బ్యాగ్ కోసం జరిగే పోరాటంలో హీరో యిన్ పాత్ర ఏంటి? అనే ఆసక్తికరమైన అం శాలతో ఈ సినిమా ఉండబోతోంది. సినిమాపై ప్రేక్షకుల్లో మంచి క్యూరి యాసిటీని పెంచుతోంది.

# జాసన్ సంజయ్ దర్శకుడిగా సిగ్మా




తమిళనాడు సీఎం, తమిళగ వెట్రి కజగం పార్టీ అధినేత విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవుతున్న మొదటి సినిమా 'సిగ్మా' విడుదల తేదీ తాజాగా ఖరారైంది. వైవిధ్యమైన పాత్రలతో మెప్పిస్తున్న టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ మరియు ఫరియా అబ్దుల్లా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ హై-ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం జులై 31న ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున థియేటర్లలోకి రానుంది. ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఎ. సుబాస్కరన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ మైండ్ గేమ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్.ఎస్. తమన్ సంగీతం అందిస్తుండగా, ప్రవీణ్ కె.ఎల్. ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మనం కోల్పోయిన దాన్ని తిరిగి అదే స్థానంలో వెతుక్కోవడం, దానికోసం ఎంత మూల్యం చెల్లించాల్సి వచ్చింది అనే ఆసక్తికరమైన కాన్సెప్ట్ చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని చిత్ర యూనిట్ పేర్కొంది. కెనడాలోని టొరంటో ఫిల్మ్ స్కూల్‌లో ఫిల్మ్ మేకింగ్ కోర్స్ మరియు లండన్‌లో స్క్రీన్‌రైటింగ్ పూర్తి చేసిన జాసన్ సంజయ్, తన తండ్రి స్టార్ ఇమేజ్‌తో సంబంధం లేకుండా ఒక వైవిధ్యమైన కథాంశంతో మెగా ఫోన్ పట్టడం పరిశ్రమలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర టీజర్ మరియు పోస్టర్లు సినిమాపై అంచనాలను భారీగా పెంచేశాయి. ఈ పాన్-ఇండియా ప్రాజెక్ట్ తెలుగు తమిళ భాషల్లో ఒకేసారి ప్రేక్షకుల ముందుకు రానుంది.

# క్రైమ్ థ్రిల్లర్‌గా మరీచిక




సంజయ్ అలియాస్ సంజు (విరాజ్ అశ్విన్) ఓ కెఫేని నిర్వహిస్తుంటాడు. అతణ్ని వెంకట లక్ష్మి (అనుపమ పరమేశ్వరన్) ప్రేమిస్తుంది. ఎప్పుడూ అతని కెఫే చుట్టూ తిరుగుతుంటుంది కానీ, తన మనసులోని ప్రేమని మాత్రం వ్యక్తం చేయలేక సతమతమవుతుంది. ఇంతలో వెంకట లక్ష్మికి లండన్ నుంచి వచ్చిన మరీచిక (రెజీనా కసండ్రా) పరిచయమవుతుంది. వెంకటలక్ష్మి కారణంగానే సంజుకి పరిచయం అవుతుంది మరీచిక. ఆ ఇద్దరి మధ్య తక్కువ సమయంలోనే సాన్నిహిత్యం పెరుగుతుంది. ఒకరినొకరు ప్రేమించుకుంటారు. ఊహించని రీతిలో ఆ ఇద్దరి ప్రేమకు వెంకటలక్ష్మి కూడా సాయం చేస్తుంది. కానీ, అంతలోనే సంజుని మరీచిక దారుణంగా చంపేస్తుంది. కళ్లారా ఆ హత్యని చూసిన వెంకటలక్ష్మి పోలీస్‌స్టేషన్‌కి చేరుకుని ఫిర్యాదు చేస్తుంది. అసలింతకీ ప్రేమించిన సంజుని మరీచిక ఎందుకు హత్య చేసింది? అసలు మరీచిక ఎవరు? సంజుపై ఉన్న ప్రేమతో వెంకటలక్ష్మి ఏం చేసింది? తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవల్సిందే. ప్రేమ, ద్రోహం, ప్రతీకారంతో ముడిపడిన కథ ఇది. పేరుకు తగ్గట్టే ఎండమావుల్ని గుర్తు చేస్తుంటాయి ఇందులోని సంఘటనలు, పాత్రలన్నీ! సున్నితమైన ఓ ముక్కోణపు ప్రేమకథలా ప్రారంభమయ్యే సినిమా ఆ తర్వాత అనూహ్యమైన మలుపులతో ఓ క్రైమ్ థ్రిల్లర్‌గా మారిపోతుంది. ప్రధానమైన మూడు పాత్రలూ ఏది నిజం, ఏది అబద్ధం అనే ఉత్కంఠని రేకెత్తిస్తాయి.

Printed, Published & Owned by B. Srinivas, Printed at RAHNUMA-E-DECCAN PRESS, H.No.12-2-837/A/3, Asifnagar, Hyderabad., Telangana-500028 Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL/2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL: +91 8333068787